



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రతిపక్ష నాయకుడు అశోక్

అన్నదాతకు షాక్..!

రాష్ట్రంలో మరో భూ వివాదం

73 ఏళ్ల క్రితం తుంగ డ్యామ్‌కు భూములు

పరిహారంగా ఇచ్చిన భూమి మాదే

400 మంది రైతులకు వ్యతిరేకంగా కోర్టులో అటవీశాఖ పిటిషన్



తుంగ డ్యామ్



బెంగళూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నదాతకు మరో షాక్ తగిలింది. ఇప్పటికే వక్ఫ్ భూముల పేరుతో కొన్ని జిల్లాల్లో నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అది సద్దు మణగక ముందే తుంగ రైతులకు అటవీశాఖ షాక్ ఇచ్చింది. అందు మూడు నాలుగు తరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలకు వక్ఫ్‌శాఖ కోలు కోలేని షాక్ ఇచ్చి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆ భూములు వక్ఫ్ ఆస్తులుగా రికార్డులు ఉన్నాయని, వదులుకోవాలని విజయపుర, హావేరి, హుబ్బళ్ళి, కలబురగి, బీదర్ జిల్లాలకు చెందిన రైతులకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. రైతులు రోడ్డెక్కడం, నోటీసు ఇచ్చిన అధికారులకు ఆధారాలు చూపాలని తిరగబడడంతో సమస్య జఠిలమైంది. రైతులకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదని ఏకంగా ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ పార్టీలు ఆందోళన చేపట్టారు. అయితే శివమొగ్గ జిల్లాలో మరో భూ వివాదం అన్నదాతలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.

ఏడు దశాబ్దాల నాటి సమస్య

73ఏళ్లక్రిందట తుంగ జలాశయం ముంపునకు గురైన భూముల రైతులకు ప్రత్యామ్నాయంగా కేటాయించిన భూములు తమకు చెందినవంటూ అటవీశాఖ కోర్టును ఆశ్రయించడం రైతులకు కునుకు లేకుండా చేస్తోంది. బాధితుల వద్ద భూములకు సంబంధించి ఈసీతోపాటు అన్ని రికార్డులు ఉన్నా 400మంది రైతులకు వ్యతిరేకంగా సబ్‌డివిజనల్ రెవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ప్రభుత్వం చేసిన తప్పులకు రైతులు కోర్టు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1951లో తుంగజలాశయం నిర్మించినప్పుడు భూములు కోల్పోయిన బాధిత రైతులకు శివమొగ్గ తాలూకా హాల్‌లక్కవళ్లిలో ప్రత్యామ్నాయ భూములు కేటాయించారు. సర్వే నెంబరు 18, 19, 20లలో వందలాదిమంది రైతులకు భూములను అప్పగించారు. భూములు కోల్పోయిన రైతులందరికీ ప్రత్యామ్నాయంగా భూమి మంజూరు చేసినా ఇవే సర్వే నెంబర్లలో మరింత భూమి ఉండడంతో భూరహిత కూలీకార్మికులకు పంపిణీ చేశారు. ఇలా రైతులందరికీ ప్రభుత్వం రెవెన్యూశాఖ ద్వారా భూ సంస్కరణ చట్టం కింద హక్కు పత్రాలు ఇచ్చారు. రైతులు వాటికి ఖాతాలను ఈసీ ఇతరత్రా రికార్డులు చేసుకున్నారు. ఈ ప్రక్రియ 1980లో అటవీ సంరక్షణా చట్టం అమలులోకి వచ్చేందుకు ముందే జరిగింది.

రికార్డుల్లో మార్పులు చేయలేదు..

భూములు కోల్పోయిన రైతులకు భూమిని పరిహారం ఇచ్చినా అటవీశాఖ యాజమాన్యం నుంచి మార్పు చేయలేదు. చట్టబద్ధంగా డీ నోటిఫికేషన్, డీ రిజర్వుగా (అటవీశాఖతో సంబంధం లేదనే) ఆదేశాలను జారీ చేయలేదు. ఇలా రైతులు అటవీశాఖ భూములను ఆక్రమించుకున్నారని పరిగణించి మంజూరు చేసిన భూములను రద్దు చేయాలని, తమ శాఖకు కేటాయించాలని అటవీశాఖ రెవెన్యూ సబ్‌డివిజనల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా భూమిని మంజూరు చేసిన శివమొగ్గ తహసీల్దారును వివాదంలో ప్రతివాదిగా నమోదు చేశారు.

నోటీసులతో బెంబేలు

అసిస్టెంట్ కమిషనర్ కోర్టు నుంచి నోటీసులు రావడంతో రైతులకు బెంబేలెత్తుతున్నారు. దీంతో తుంగ జలాశయం ముంపు బాధితులంతా ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. 73 ఏళ్లక్రిందట ప్రత్యామ్నాయ పరిహారం రూపంలో దక్కిన భూములను కాపాడుకునేందుకు ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, అటవీశాఖ మంత్రులకు వినతిపత్రాలు అందజేశారు. డీనోటిఫికేషన్ కానీ డీ రిజర్వు ద్వారా ఆదేశాలను ఇప్పించాలని కోరుతున్నారు. అయితే అత్యంత విచారకరమైన విషయం వెలుగులోకి వచ్చింది. శివమొగ్గ తాలూకా తహసీల్దారు కార్యాలయం, జిల్లా అధికారి కార్యాయలంలో 1951లో తుంగ ముంపు బాధితులకు భూ పరిహారానికి సంబంధించిన రికార్డులే లేవు. అధికారులు రైతుల వద్ద ఉండే పాత రికార్డులను ఇవ్వాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ఏం జరుగుతుందనేది రైతుల్లో ఆందోళన మొదలైంది.

లంచాలు ఇచ్చుకోలేకే..

ఆత్మహత్యలు

- కాంగ్రెస్ పాలనలో అధికారులపై పెరిగిన వేధింపులు
- బదిలీలు, ప్రమోషన్లు అన్నింటికీ ఆమ్యామ్యాలే..
- ప్రతిపక్ష నాయకుడు అశోక్

బళ్లారి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో లంచాలు ఇచ్చుకోలేకే అధికారులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని, పై నుంచి కింది స్థాయి వరకు లంచాల భూతం పీడిస్తోందని ప్రతిపక్ష నేత అశోక్ ఆరోపించారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సండూరు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం భ్రష్టు పట్టిందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రులకు అధికారులు లంచం ఇవ్వాల్సిందేనని, లేకపోతే పనులు కావు, ప్రమోషన్లు జరగవు.. బదిలీలు అసాధ్యమన్నారు. అధికారులను కాంగ్రెస్ నాయకులు అన్ని రకాలుగా ఇబ్బంది పెడుతున్నారన్నారు. వేధింపులకు తాళలేకే అధికారులు ఆత్మహత్యలు పాల్పడడం బాధాకరమన్నారు. ముడా అవినీతిలో సీఎం అడ్డంగా దొరికిపోయారని, దాని నుంచి తప్పించుకోవడానికి బీజేపీపై ఆరోపణలు చేయడం తగదన్నారు. కేసుల నుంచి తప్పించుకోవడానికే ఆయన ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ నెరవేర్చలేదని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న మూడు నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. చెన్నపట్టణలో బీజేపీ, జేడీఎస్ విజయం ఖాయమన్నారు. ఉప ఎన్నికల్లో కొందరు అధికారులు కాంగ్రెస్ పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్నారని అశోక్ అరోపించారు. మూడు చోట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉందని, అధికారుల పై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయనతోపాటు బళ్లారి జిల్లా బీజేపీ నాయకులు గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కారులో చిక్కుకున్న మృతదేహం

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

- ఇద్దరు పిల్లలకు తీవ్రగాయాలు
- కారును ఢీ కొన్న లారీ

బెంగళూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. గదగ్ జిల్లా నరగుంద తాలూకా భైరనహట్టి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న కారును లారీ ఢీ కొనడంతో దంపతులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. బుధవారం ఉదయం ప్రమాదం చోటు చేసుకుంది. బాగల్కోటెకు చెందిన సిద్ధరామ, ఆయన భార్య హేమ దంపతులు దుర్మరణం చెందారు. పిల్లలు మల్లికార్జున, సహనాలు తీవ్రంగా గాయపడ్డారు. కుక్కె సుబ్రహ్మణ్యేశ్వర ఆలయానికి వెళ్లి సొంతూరు బాగల్కోటెకు వెనుదిరిగి వస్తుండగా హుబ్బళ్ళి-విజయపుర జాతీయ రహదారి 218పై ప్రమాదం జరిగింది. హుబ్బళ్ళివైపు వెళ్తున్న లారీ, కారును ఢీకొంది. నరగుంద పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ నడువినమని మాట్లాడుతూ ప్రమాదధాటికి కారు నుజ్జునుజ్జుకావడంతో అందులో చిక్కుకున్న మృతదేహాలను, బాధితులను వెలికి తీసేందుకు శ్రమించాల్సి వచ్చిందన్నారు.



చలో.. చన్నపట్టణ..!

- ఊపందుకున్న ఉప ప్రచారం
- మనవడి కోసం మాజీ ప్రధాని దేవెగౌడ
- యోగేశ్వర్ తరపున సీఎం



చన్నపట్టణ బహిరంగ సభలో మాజీ ప్రధాని దేవెగౌడ



ప్రచారంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల్లో ప్రచారం జోరందుకుంది. బుధవారం చన్నపట్టణ, శిగ్గావి నియోజకవర్గాల్లో ప్రచారం హోరెత్తింది. చన్నపట్టణ బీజేపీ-జేడీఎస్ అభ్యర్థి నిఖిల్ తరపున మాజీ ప్రధాని దేవెగౌడ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన అంబులెన్స్‌లో వచ్చి ప్రచారం చేస్తారా..? అంటూ తనను ఎద్దేవా చేశారని దేవెగౌడ మండిపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి సీపీ యోగేశ్వర్ పేరు ప్రస్తావించకుండానే, కాంగ్రెస్‌లో చేరిన కొత్త నాయకుడంటూ ఎద్దేవా చేశారు. బీజేపీ నేత యడియూరప్ప, కేంద్రమంత్రి కుమారస్వామి వివిధ గ్రామాల్లో రోడ్‌షోలు జరిపారు. ముడా కేసులో మైసూరు లోకాయుక్త ముందు విచారణలో పాల్గొని అనంతరం చన్నపట్టణలో అభ్యర్థి యోగేశ్వర్ తరపున సీఎం సిద్దరామయ్య వివిధ సభల్లో పాల్గొన్నారు. శిగ్గావిలో డీసీఎం డీకే శివకుమార్ ప్రచారం చేశారు. శిగ్గావిలో కాంగ్రెస్ అభ్యర్థి యాసిర్ అహ్మద్‌ఖాన్‌ను గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. మంత్రులు ఈశ్వర్‌ఖండ్రె, రెహమాన్‌ఖాన్, లక్ష్మీహెబ్బాళ్కర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ నలపాడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా శిగ్గావిలో బీజేపీ అభ్యర్థి భరత్ తరపున బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర ప్రచారం చేశారు.

నేటి నుంచి నాగసంద్ర -మాదవార మెట్రో సేవలు

- ట్రయల్‌రన్‌లో డీసీఎం, ఎంపీ తేజస్వీ



నాగసంద్ర నుంచి బయల్దేరుతున్న మెట్రో రైలు



మెట్రోలో డీసీఎం డీకే శివకుమార్, ఎంపీ తేజస్వీ సూర్య

బెంగళూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెట్రో సేవల విస్తరణ పెరుగుతోంది. తుమకూరు రోడ్డుకు అనుబంధంగా ఉండే గ్రీన్‌లైన్‌లో నాగసంద్ర - మాదవారల మధ్య గురువారం నుంచి మెట్రో సంచారం అందుబాటులోకి రానుంది. బుధవారం జరిగిన ట్రయల్‌రన్‌లో డీసీఎం డీకే శివకుమార్, బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య ప్రయాణించారు. నాగసంద్ర - మాదవారల మధ్య మెట్రో సేవలకు అనుకూలం ఉండడంతో గత నెలలోనే డీసీఎం, ఎంపీ తేజస్వి సూర్య కేంద్ర నగరాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు లేఖలు రాశారు. అయితే కేంద్రం నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో ప్రయోగాత్మకంగా శ్రీకారం చుట్టారు. గతంలోనూ ఇదే తరహాలో ఆడంబరమైన ప్రారంభం లేకుండానే మెట్రో సేవలు విస్తరించిన దాఖలాలు ఉన్నాయి. అదే తరహాలోనే గురువారం నుంచి నాగసంద్ర - మాదవారల మధ్య సేవలు కొనసాగనున్నాయి. ఈ విషయంపై డీసీఎం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ రెండు స్టేషన్‌ల మధ్య 3.14 కిలోమీటర్ల దూరం ఉంటుందన్నారు. వీటిలో మంజునాథనగర్, చిక్కబిదరకల్లు (జిందాల్‌నగర్), మాదవార (బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ - బీఐఈసీ) ల మధ్య సంచరించనుంది. ఈ మార్గంలో ఆగస్టు 12 నుంచి 17వరకు సిగ్నలింగ్‌తోపాటు అన్ని విభాగాల ప్రయోగాలు పూర్తి చేసి అక్టోబరు 3కు రైల్వే సేఫ్టీ కమిషన్ సందర్శన కూడా ముగిసింది. అక్టోబరు 4నుంచే వాణిజ్య సేవలకు అనుమతి ఇచ్చారు. కాగా బుధవారం ట్రయల్‌రన్‌లో ఎమ్మెల్యేలు మునిరత్న, శివణ్ణ తదితరులు పాల్గొన్నారు.

రెబెల్స్ శిబిరంలో శోభ

- వక్ఫ్ వివాదంపై బీజేపీ నిరవధిక దీక్ష
- ఒకే వేదికపై విజయేంద్ర వ్యతిరేకులు
- కేంద్రమంత్రి శోభాకరంద్లాజె హాజరుపై ఆశ్చర్యం



వేదికపై కేంద్రమంత్రి శోభాకరంద్లాజె తదితరులు

బెంగళూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): తరతరాలుగా సాగు చేస్తున్న భూములను వక్ఫ్ ఆస్తులుగా పరిగణిస్తూ రైతులకు నోటీసులు జారీ చేసిన వివాదం తీవ్రమవుతోంది. ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ విజయపురలో చేపట్టిన నిరవధిక దీక్ష వేదికపై రెబల్స్ అంతా ఒక్కటవుతున్నారు. ఇటీవల ఆయన పలు విషయాల్లో మాజీ సీఎం యడియూరప్ప, కుమారుడు విజయేంద్రపై భాహాటంగా విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. అయితే పలువురు బీజేపీ రెబెల్స్ ఆయనకు మద్దతు పలుకుతున్నారు. ఆయన చేపట్టిన దీక్షలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. విజయపురలో జరిగిన దీక్షలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె మంగళ, బుధవారాలలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఆమె దీక్షా శిబిరంలోనే గడిపారు. వేదికపైనే భోజనం చేశారు. చడచణ తాలూకా హలసంగి గ్రామానికి చెందిన రైతులు సిద్దరామకొట్టలగి, తుకారాం బోగాల, విజయకుమార్ రాంపుర, గురుదేవి తరళి, రాజశేఖర్ తట్టిమనెలాంటివారు పాల్గొన్నారు. కాగా బుధవారం నిరసనకు బీజేపీ నుంచి బయటకు వచ్చిన మాజీ మంత్రి ఈశ్వరప్ప మద్దతు తెలిపారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరవధిక పోరాటంలో మూడోరోజు నిరసనలో కూడలసంగమ లింగాయత పంచమసాలి మహాపీఠం జగద్గురు బసవజయ మృత్యుంజయ స్వామీజీ, ఎంపీ రమేశ్ జిగజిణగి, రాజ్యసభ సభ్యుడు నారాయణసా బాండగె తదితరులు మద్దతు ఇచ్చారు. రైతులకు ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని, వక్ఫ్ భూమల పేరుతో గందరగోళం సృష్టించరాదని డిమాండ్ చేస్తున్నారు. అయితే రాష్ట్ర బీజేపీలో యడియూరప్పకు అత్యంత సన్నిహితురాలిగా పేరొందిన శోభాకరంద్లాజె ప్రస్తుతం విజయపురలో వక్ఫ్ హఠావో ఆందోళనలో పాల్గొనడం సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. ఇటీవల కొన్నేళ్లుగా యడియూరప్ప, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్రలకు వ్యతిరేకంగా యత్నాళ్ ఎన్నో ఆరోపణలు చేశారు. అటువంటి ది యత్నాళ్ చేపట్టిన దీక్షలో ఆమె పాల్గొనడం పార్టీలో కుతూహలం రేకెత్తిస్తోంది.



ముడా కార్యాలయం

ఈడీ ముందుకు ముడా మాజీ కమిషనర్

- మరో ఏడుగురికి నోటీసులు

బెంగళూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి): 'ముడా' వివాదానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల దాడి నేపథ్యంలో పరారైన మాజీ కమిషనర్ దినేశ్‌కుమార్ వెనుదిరిగి వచ్చారు. బుధవారం బెంగళూరు శాంతినగర్‌లోని ఈడీ కార్యాలయంలోని అధికారుల ముందు హాజరయ్యారు. ఆగస్టు 28న ఈడీ అధికారులు బెంగళూరులోని దినేశ్‌కుమార్ నివాసంపై దాడి చేశారు. ఇదే సమయంలో వాకింగ్ చేస్తున్న దినేశ్‌కుమార్ విషయం తెలియగానే పరారీ అయ్యారు. ఆ తర్వాత ఈడీ అధికారులు విచారణకు హాజరు కావాలని ఇంటికి నోటీసులు అందించారు. కొంతకాలంగా పరారీలో ఉన్న దినేశ్‌కుమార్ ఒక్కసారిగా ఈడీ ముందుకు హాజరయ్యారు.

దర్యాప్తు వేగవంతం

ముడా వివాదంలో లోకాయుక్త విచారణలకు సీఎం సిద్దరామయ్య హాజరు కాగా.. మరోవైపు ఈడీ కూడా దర్యాప్తు వేగవంతం చేసింది. బుధవారం విచారణకు హాజరు కావాలని ఏడుగురికి నోటీసులు జారీ చేసింది. ముడా తాజా మాజీ ఛైర్మన్ మరిగౌడ, సీఎం సిద్దరామయ్య ఆప్తుడు రాకేశ్ పావణ్ణతోపాటు పలువురికి నోటీసులు జారీ చేసింది. ఈనెల 8న విచారణకు హాజరు కావాలని సూచించారు.


ఆమెతోనే అధికారం..!

- సండూరులో మహిళా ఓటర్లే అధికం
- గెలుపులో కీలకపాత్ర వారిదే..
- హామీలతో గాలం వేస్తున్న నేతలు

బళ్లారి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సండూరు ఉపపోరులో కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలూ మహిళా ఓటర్లపైనే ఆశలు పెంచుకున్నాయి. నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికంగా ఉండడం, వారే విజయంలో కీలకపాత్రగా ఉండడంతో వారికే నేతలు వల వేస్తున్నారు. ఉప పోరులో కాంగ్రెస్ తన అభ్యర్థిగా మహిళనే బరిలోకి దించడంతో మహిళల ప్రాధాన్యం మరింత పెరిగింది. గత సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ శిల్పా రాఘవేంద్ర ను పోటీలో నిలిపింది. అయితే ఈ సారి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీ తుకారాం సతీమణి అన్నపూర్ణను రంగంలోకి దించింది. అన్నపూర్ణ చాలా ఏళ్లగా రాజకీయాల్లో పరోక్షంగా రానిస్తుంది. తుకారాం ఎమ్మెల్యేగా ఉన్నా అధిక భాగం ఆమే కీలకంగా వ్యవహరించింది. స్థానిక నేతలతోనూ, అధికారులతోనూ కలివిడిగా ఉండేది. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ ఆమె సుపరిచితురాలే.. దీంతో ఎక్కడా తడబడకుండా ఓటేసి గెలిపిస్తే మహిళల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీ ఇస్తోంది.

బీజేపీ సైతం మహిళనే బరిలోకి దింపాలని ప్రయత్నించింది. అయితే అనూహ్యంగా అధిష్టానం బంగారు హనుమంతుకు టికెట్ ఇవ్వడంతో స్థానిక బీజేపీ నాయకులు, గాలి జనార్దన్‌రెడ్డి వెంట నడిచే కొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకానొక దశలో శిల్పాకు కాంగ్రెస్ కూడా గాలం వేసి ఆమేనే బరిలో దింపాలనుకంది. కానీ చివరి క్షణంలో నిర్ణయం మార్చుకుంది. ఇక ప్రచారంలోనూ మహిళా ఓటర్లకే వరాలు విసురుతున్నారు. మహిళలకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని, ఆదరిస్తే మరింత అభివృద్ధి చేపడ్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇస్తున్నారు. బీజేపీ కూడా మార్పు జరగాలని, పదే పదే అదే ఇంటి వారికి గెలిపించడం వల్ల అభివృద్ధి జరగదని ప్రచారం సాగిస్తున్నారు. సండూరు క్షేత్రంలో మొత్తం 2లక్షలా 36 వేలా, 349 ఓటర్ల ఉన్నారు.

వీరిలో మహిళా ఓట్లు పురుష ఓటర్ల కంటే ఎక్కువ మంది ఉన్నారు. 1,18,435 మంది మహిళా ఓటర్లున్నారు. 1,17,935 మంది పురుష ఓటర్లు ఉన్నారు. మిగిలిన వారు 29 మంది, మొత్తం 2,36,402 మంది ఓటర్లున్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలూ మహిళా ఓటర్ల పైనే దృష్టి పెట్టారు.



కాంగ్రెస్ లో అభ్యర్థి ప్రచారం చేస్తుంటే బీజేపీ తరపున గాలి జనార్దన్‌రెడ్డి భార్య లక్ష్మి అరుణ మహిళ ఓటర్లను ఆకట్టుకునేలా ప్రచారం సాగిస్తున్నారు. అయితే మహిళలు ఎవరి వైపు మొగ్గు చూపుతారో అని నాయకులు టెన్షన్‌లో ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

జేడీఏకి ఎరువుల డీలర్ల సంఘం వినతి



ఉమామహేశ్వరమ్మను సన్మానిస్తున్న డీలర్ల సంఘం అధ్యక్షుడు చింతా వెంకటేశ్వర్లు, నాయకులు గంగాధర్, రమేష్, రంగయ్య

అనంతపురం అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాల డీలర్ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని జేడీఏ ఉమామహేశ్వరమ్మకు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతా వెంకటేశ్వర్లు విన్నవించారు. డీలర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా ఉపాధ్యక్షుడు గంగాధర్, కోశాధికారి రమేష్, రంగయ్య తదితరులతో కలిసి బుధవారం ఆయన జేడీఏను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన కార్యవర్గానికి జేడీఏ శుభాకాంక్షలు తెలియజేశారు. డీలర్ల సమస్యలు ఎవైనా తన దృష్టికి తీసుకువస్తే, తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ప్రజాపోరును జయప్రదం చేయండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



ప్రజాపోరు బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారాన్ని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 14వతేదీ వరకు చేపట్టనున్న ప్రజాపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రజాపోరు బ్రోచర్లను బుధవారం ఆవిష్కరించారు. నెలరోజులుగా కూరగాయలు, నిత్యావసర వస్తువులు, వంట నూనెల ధరలు భారీగా పెరుగుతున్నాయని అన్నారు. పండుగలు, రోజువారి సరుకుల కొనుగోళ్లలోనూ ధరల ప్రభావం కనిపిస్తోందని అన్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను తక్కువ ధరలకు అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల అదుపుకోసం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువత నిరాశకు గురవుతోందని అన్నారు. డీఎస్సీ వాయిదా పడిందని, గ్రూప్-1, గ్రూప్-2 పోస్టుల భర్తీ అగమ్యగోచరంగా ఉందని అన్నారు. కోచింగ్ తీసుకున్న యువత అయోమయంలో ఉందని, వెంటనే రిక్రూట్మెంట్ ప్రారంభించి ఉపాధి కల్పించాలని కోరారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు పెరుగుతున్నాయని అన్నారు. ఆచూకీ కనపడని ఆడపిల్లల సంఖ్య పెరుగుతోందని, గత ప్రభుత్వానికన్నా భిన్నమైన పాలన అందిస్తామన్న కూటమి వాగ్దానాలు అమలులోకి రాలేదని అన్నారు. అవినీతి విచ్చలవిడిగా సాగుతోందని అన్నారు. ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగిపోతున్నాయని అన్నారు. ఉచిత ఇసుక విధానం నేటికీ అమల్లోకి రాలేదని అన్నారు. విద్యుత్ చార్జీలను పెంచబోమంటూనే ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.20వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేశారని, వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, బాలరంగయ్య, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నగర కార్యదర్శి వెంకటనారాయణ, సీపీఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు అలేఖ్య



బరువులు ఎత్తుతున్న అలేఖ్య

రామగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు కుంటిమద్ది ప్రభుత్వ పాఠశాల విద్యార్థి అలేఖ్య ఎంపికైనట్లు హెచ్‌ఎం అనంతపద్మానాభులు, పీడీ నాగేశ్‌బాబు బుధవారం తెలిపారు. ఈ నెల 2, 3, 4తేదీలలో తెనాలిలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ అండర్-17 వెయిట్‌లిఫ్టింగ్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారని తెలిపారు. డిసెంబరులో మణిపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థినిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

అమ్మ చదివితే ఇంటిల్లిపాదికీ ప్రయోజనం: కలెక్టర్



ప్రశాంతి జిల్లా సమాఖ్య వార్షికోత్సవంలో కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అమ్మ విద్యావంతురాలైతే ఇంటిల్లిపాదీ విద్యావంతులు, ప్రయోజకులు అవుతారని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ప్రశాంతి జిల్లా సమాఖ్య 20వ వార్షిక మహాజన సభను టీటీడీసీలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్.. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తన తల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా పనిచేసే సమయంలో తనను వెంట తీసుకెళ్లేవారని అన్నారు. ఆ సమయంలో మహిళల బాగోగులు, ఆరోగ్యం గురించి తన తల్లి అడిగి తెలుసుకునేవారని గుర్తు చేసుకున్నారు. తన తల్లి ప్రోత్సాహం, తండ్రి సహకారం, అక్క మమకారమే తనను ఐఏఎస్ స్థాయికి చేర్చాయని తన వ్యక్తిగత జీవితాన్ని పంచుకున్నారు. తల్లి చదివితే ఇంటిల్లిపాదీ విద్యావంతులు అవుతారని, ఇది తనకు బాగా వర్తిస్తుందని అన్నారు. ప్రతి మహిళా చదివి, స్వయం ఉపాధితో సొంత కాళ్లపై నిలబడాలని, ఆర్థిక సాధికారత సాధించి సమాజంలో నిర్ణయాత్మకశక్తిగా మారాలని ఆకాంక్షించారు. డ్వాక్రా మహిళలు ఐక్యత, నిబద్ధత, ఆర్థిక క్రమశిక్షణకు చిహ్నాలుగా నిలుస్తున్నాయని కొనియాడారు. మహిళ అభివృద్ధి సమాజాభివృద్ధికి బాటలు వేస్తుందని అన్నారు. డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేయడానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, పేదరికం నుంచి విముక్తి పొందాలని పిలుపునిచ్చారు.

బాల్య వివాహాలను అరికడదాం..

బాల్య వివాహాల నివారణలో డ్వాక్రా మహిళలు భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి కోరారు. భ్రూణ హత్యలను అరికట్టాలని, మహిళలపై దాడులను ఐక్యంగా తిప్పికొట్టాలని అన్నారు. మహిళల అభివృద్ధికి వంద రోజుల ప్రణాళికతో సమష్టిగా కృషి చేస్తున్నామని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. బ్యాంకు రుణాలతో ఆర్థిక సాధికారత దిశగా డ్వాక్రా సంఘాలు అడుగులు వేస్తున్నాయని అన్నారు. ప్రశాంతి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు షేకన్ బీ వార్షిక నివేదిక ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో రెడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు భానుజా, ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యదర్శి రాధమ్మ, ఉపాధ్యక్షురాలు సుజాత, సహాయ కార్యదర్శి సుహాసిని, కోశాధికారి లలిత, డీఆర్‌డీఏ-వెలుగు డీపీఎంలు రాధారాణి, జిలాన్, సత్యనారాయణ, గంగాధర్, రవీంద్రబాబు, రాజ్యలక్ష్మి, శివప్రసాద్, హనుమేష్, అనిత తదితరులు పాల్గొన్నారు.

కుయ్ కుయ్.. నయ్ నయ్..!

అత్యవసర వేళల్లో ఫోన్ చేయగానే.. కుయ్ కుయ్ అంటూ వచ్చే 108 వాహనాలు ఇపుడు నయ్ నయ్ అంటున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఈ వాహనాల నిర్వహణ బాధ్యతలను ఆ పార్టీ కీలకనేత అల్లుడికి కట్టబెట్టింది. ఈ సంస్థ జనం ఆరోగ్య సేవల కన్నా సొంత లాభానికే అధిక ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ సొమ్మును దోపిడీ చేసిందని విమర్శలు ఉన్నాయి. సరైన నిర్వహణలేక చాలా వాహనాలు దెబ్బతిన్నాయి. దీంతో రోగులను తీసుకొచ్చేటపుడు ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయి. మరోవైపు వాహనాలు కండీషన్‌లో లేకపోవడంతో నిరంతరం ప్రమాదాలకు గురవుతున్నాయి. వీటి నిర్వహణ చూసే అరబిందో సంస్థ ఏమాత్రం పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. -ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్



రాప్తాడులో గ్యారేజీ వద్ద పడిఉన్న 108 వాహనాలు

ప్రమాదపుటంచున 108 వాహనాలు

- మరమ్మతులు లేక మొండికేస్తున్న వైనం
- బాధ్యతల నుంచి తప్పుకున్న అరబిందో
- మూడు రోజులుగా డీజిల్ సమస్య
- ఆగిపోనున్న అత్యవసర సేవలు



జిల్లా కేంద్రంలో చెడిపోయి నిలిచిపోయిన 108 వాహనం

దారి మధ్యలో ఆగుతున్నాయ్..

బాధితులను సకాలంలో ఆసుపత్రులకు తరలించి వైద్యసేవలు అందేలా చూసి ప్రాణాలు కాపాడే 108 వాహనాలే ప్రమాదంలో పడిపోయాయి. అధికారిక లెక్కల ప్రకారం అనంతపురం జిల్లాలో 108 వాహనాలు 33 నడుపుతున్నారు. ఎక్కడైనా ప్రమాదం ఉంటే 20 నిమిషాలలోపు అక్కడికి వెళ్లి రోగిని తీసుకొని ఆసుపత్రికి తీసుకెళ్లాలి. కానీ వాహనాలు దెబ్బతినడంతో రోగులు కాల్‌చేసినా గంటలకొద్దీ చేరుకోలేక పోతున్నాయి. ఒకవేళ సమయానికి వెళ్లినా మధ్యలో ఏ టైరు ఎక్కడ పంక్చర్ అవుతుందో.. ఎక్కడ ఏది ఊడిపోయి నిలబడుతుందో తెలియని పరిస్థితి. ఇటీవల కూడేరు, ఉరవకొండ, బెళుగుప్ప, అనంతపురంరూరల్, రాప్తాడు మండలాల పరిధిలో 108 వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. మరికొన్ని వాహనాలు చెడిపోయి మధ్యలో ఆగిపోయాయి. ఆ సమయంలో రోగులు నరకం చూడాల్సి వస్తోంది. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు మరమ్మతులతో రాప్తాడు వద్ద గ్యారేజ్‌లో క్యూ కడుతున్నాయి.

డీజిల్ కష్టాలు

నిర్వహణ తీరుపై ప్రభుత్వం ఇప్పటికే సంస్థను హెచ్చరించింది. ఈ నేపథ్యంలో 108 వాహనాలు నిర్వహణ చూస్తున్న అరబిందో సంస్థ బాధ్యతల నుంచి తప్పుకుంది. టెండర్ ద్వారా మరో కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో గత మూడు రోజులుగా 108 వాహనాల నిర్వహణ మరింత దారుణంగా మారింది. డీజిల్‌కు డబ్బుల్లేక అనేక వాహనాలు ఆగిపోయాయి. గతంలో రోజుకు ఒక్కొక్క వాహనానికి రూ.5వేలు క్రెడిట్ కార్డులోకి వేసేవాళ్లు. దాని ద్వారా అవసరమైనచోట కార్డు పెట్టి డీజిల్ వేయించుకునేవారు. నిర్వహణ సంస్థ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో గత మూడు రోజులుగా డీజిల్‌కు డబ్బులు వేసేవారులేరు. ఇప్పటికే 10 వాహనాలకు పైగానే డీజిల్‌కు డబ్బుల్లేక నిలిపివేసినట్లు సమాచారం. ఇలాగే సాగితే మరో రెండురోజుల్లో మొత్తం వాహనాలు నిలిచిపోతాయి. జిల్లా అధికారులు స్పందించకపోతే సమస్య మరింత జటిలమై అత్యవసర సేవలకు అంతరాయం కలిగే ప్రమాదం ఉంది.

మాచేతుల్లో ఏమీలేదు

108 వాహనాల నిర్వహణ బాధ్యతల నుంచి అరబిందో సంస్థ తప్పుకుంది. మళ్లీ నిర్వహణ ఎవరు చూస్తారో మాకు తెలియడంలేదు. ప్రతిరోజూ డీజిల్‌కు సంస్థ రూ.5వేలు క్రెడిట్ కార్డులో జమ చేసేది. గత మూడు రోజులుగా డీజిల్‌కు డబ్బులు వేయడంలేదు. సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వలేదు. దీంతో వారు కూడా పట్టించుకోలేదు. డీజిల్ అయిపోయిన వాహనాలను ఎక్కడికక్కడ నిలిపేశారు. అత్యవసర సేవలకు డీజిల్ ఉన్న వాహనాలను పంపిస్తున్నాం. ఇంతకన్నా మేమేమీ చేయలేం. ప్రభుత్వమే తగిన చర్యలు తీసుకోవాలి.

- కొండారెడ్డి, 108 జిల్లా ఇన్‌చార్జ్ కో-ఆర్డినేటర్



జిల్లా ఆసుపత్రికి రోగులను తీసుకొచ్చిన 108 వాహనాలు

మా దృష్టికి రాలేదు : డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్ఓ

108 వాహనాల నిర్వహణ మా పరిధిలో ఉండదు. అవి సక్రమంగా తిరుగుతున్నాయా లేదా అని మాత్రమే పరిశీలిస్తుంటాం. డీజిల్‌కు డబ్బులు లేవని, వాహనాలు నిలబడుతున్నాయని మాకు ఎవరూ చెప్పలేదు. ఒకవేళ చెబితే ఈ విషయాన్ని కలెక్టర్ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం. సమస్యలు లేకుండా చూస్తాం. వాటి నిర్వహణ నిధులు వైద్యశాఖ పరిధిలో ఉండవు.

రైతుల మధ్య దొంగల చిచ్చు

పొలాల్లో మోటార్లు, కేబుల్ చోరీ

గోపరాజుపల్లి యువకులపై ఫిర్యాదు

కుందేలు వేటకు వచ్చామన్న యువకులు



శింగనమల పోలీస్ స్టేషన్ వద్ద రెండూళ్ల రైతులు

శింగనమల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పొలాలలో వ్యవసాయ మోటార్లు, కేబుల్ వైర్ల చోరీ వ్యవహారం రెండు గ్రామాల రైతుల మధ్య విభేదాలను రాజేసేలా ఉంది. మండల పరిధిలోని నిదనవాడ పొలాల్లో రెండురోజులకోసారి పొలాల్లో మోటార్లు, కేబుల్ మాయమౌతోంది. దీంతో రైతులు ఆగ్రహంగా ఉన్నారు. ఈ క్రమంలో పెద్దవడుగూరు మండలం గోపరాజుపల్లి గ్రామ యువకులు మంగళవారం రాత్రి పొలాల వద్ద కనిపించడంలో నిదనవాడ రైతులు వారిని చితకబాది శింగనమల పోలీసులకు అప్పగించారు. అయితే, తాము కుందేళ్ల వేటకు వచ్చామని ఆ యువకులు అంటున్నారు. ఈక్రమంలో రెండు గ్రామాల రైతులు బుధవారం పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చారు. పరస్పరం వాగ్వాదానికి దిగారు. 'మా పిల్లలు కుందేళ్ల వేటకు వచ్చారు. మీ భూములు, మా భూములు అక్కడే కదా ఉన్నాయి..? రోజూ మమ్మల్ని చూస్తూనే ఉన్నారు కదా..? వారిని పట్టుకుని ఎలా కొడతారు..?' అని గోపరాజుపల్లి రైతులు ప్రశ్నించారు. పొలాల వద్దకు రాకుండా ఉంటారా.. చూద్దాం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటపాటు ఉద్రిక్తత కొనసాగడంతో పోలీసులు ఇరువర్గాలను అక్కడి నుంచి పంపేశారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది. పొలాల వద్ద మోటార్లు, రాగి వైరు చోరీ అవుతోందని, ఈ క్రమంలో పొలాల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆరుగురు యువకులను పట్టుకున్నామని నిదనవాడ రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకులను విచారిస్తున్నామని ఎస్ఐ శరత్ చంద్ర తెలిపారు. మొత్తంగా దొంగల వ్యవహారం రైతుల మధ్య విభేదాలను రాజేసేలా కనిపిస్తోంది. పోలీసులు సమగ్రంగా విచారించి, మునుముందు సమస్యలు తల్తెకుండా చూడాల్సిన అవసరం ఉంది.

5వేల కేసుల రాజీనే లక్ష్యం

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్.. జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో 5వేల కేసులను రాజీ కుదర్చడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించనున్నట్లు జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 14న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని కోర్టుల్లో పెండింగులో ఉన్న మోటారు వాహనాల ప్రమాద భరిత కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్సు కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ చేస్తామన్నారు. సంబంధిత కక్షిదారులందరూ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ ఏడాదిలో ఇది చివరి జాతీయ లోక్ అదాలత్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లలో వెలువడే తీర్పులు అంతిమం అన్నారు. సివిల్ కేసులలో రాజీ అయిన వారికి కోర్టు కట్టిన ఫీజులు వెనక్కు తీసుకునే అవకాశం ఉందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ కావడం ద్వారా ఇరు పార్టీలు నెగ్గినట్లవుతుందని తెలిపారు. దీంతో గతంలోలాగా వారి స్నేహ సంబంధాలు కొనసాగుతాయన్నారు. ఇంతకు ముందు జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 6వేల కేసులను రాజీ కుదిర్చామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్, జిల్లాలోని వివిధ కోర్టుల న్యాయాధికారులు పాల్గొన్నారు.

వివిధ కోర్టుల న్యాయాధికారులు



డ్యాం గేటుకు గోడ

లీకేజీలు అరికట్టే పేరిట నిర్మాణం.. ప్రమాదం జరుగుతుందని రైతుల ఆందోళన



సుబ్బరాయసాగర్ గేటుకు అడ్డంగా కట్టిన గోడ

పుట్లూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సుబ్బరాయసాగర్ డ్యాం గేటు దెబ్బతినడంతో ఇంజనీరింగ్ అధికారి అక్కడ గోడ కట్టించారు. మరమ్మతు చేయించకుండా ఇలా గోడ కట్టించడం ఏమిటని రైతులు అభ్యంతరం చెబుతున్నారు. డ్యాం సామర్థ్యం అర టీఎంసీ కాగా, తుంపెర డీప్ కట్ నుంచి డ్యాంలోకి నీరు చేరుతోంది. ఒక గేటు దెబ్బతిన్న కారణంగా 20 క్యూసెక్కుల నీరు వృథాగా వెళుతోంది. దీంతో నీటి నిల్వలను కాపాడేందుకు గేట్లను మూసివేయించారు. భారీగా నీరు చేరితే గేటు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని భావించిన అధికారి.. గోడ కట్టించారు. రెండు గేట్ల ద్వారా పుట్లూరు మండల పరిధిలోని మూడు చెరువులకు, 29వ డిస్ట్రిబ్యూటరీకి నీటిని విడుదల చేస్తుంటారు. గోడ కట్టిన కారణంగా ఇకపై గేటు నుంచే నీరు దిగువకు వదలాల్సి ఉంటుంది. ఒత్తిడి పెరిగితే ఆ గేటు కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గోడకట్టిన విషయం తెలుసుకున్న సంజీవపురం, కడవకల్లు రైతులు డ్యాం వద్దకు వెళ్లి అధికారులను ప్రశ్నించారు. గేటుకు గోడ కట్టడం వల్ల డ్యాంకు ప్రమాదం తలెత్తుతుందని టీడీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరారు. లీకేజీ నీటిని డ్యాం కింద ఉన్న అరటి తోటలకు వాడుతున్నారని, వృథా కావడం లేదని అన్నారు. ప్రతి రోజూ 20 క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్నందుకే గోడ కట్టించామని హెచ్చెల్సీ ఏఈ శ్రీనివాసులు అన్నారు. ఉన్నతాధికారులు చెబితే గోడను కూల్చివేయిస్తామని తెలిపారు.

ఎస్సీ వెల్ఫేర్ డీడీగా ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ శాఖ కార్యదర్శి కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి కర్నూలు ఎస్సీ వెల్ఫేర్ డీడీగా విధులు నిర్వర్తిస్తూ... అదే జిల్లాలోని 'కుడా'లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఆయనను అనంతపురం జిల్లా ఎస్సీ వెల్ఫేర్ డీడీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నేడో రేపో ఆయన బాధ్యతలు తీసుకోనున్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న లారీ

రాయచూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న భారీ రోడ్డు పక్క ఉన్న చెట్టును ఢీకొట్టి అదే వేగంతో పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటన బుధవారం ఉదయం తాలూకాలోని హంచినాళ సమీపంలో చోటు చేసుకుంది. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే 20 చక్రాలు ఉన్న భారీ వాహనం అదుపు తప్పి చెట్టును అనంతరం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. లారీ ఢీకొట్టడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పక్కనే ఉన్న స్తంభాలన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఎవరూ లేకపోవడం విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిసింది. ప్రమాదంలో జెస్కాం సంస్థకు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని యరగేరా పోలీసులు సందర్శించి కేసు నమోదు చేశారు.

జింకా.. ఏమయ్యావే..!



ప్రమాదంలో మృతిచెందిన జింక, సాయంత్రానికి చెట్ల కొమ్మల కిందకు చేరిన కళేబరం

విడపనకల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బళారి-ఉరవకొండ జాతీయ రహదారిపై పెద్దకొట్టాలపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని బుధవారం ఉదయం ఓ జింక మృతిచెందింది. ఈ విషయాన్ని పోలీసు, అటవీశాఖ అధికారుల దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకువెళ్లింది. అటవీశాఖ అధికారులు సాయంత్రం వరకూ అక్కడికి రాలేదు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు జింక కళేబరాన్ని రోడ్డు పక్కన కానుగ చెట్లకింద దాచారు. ఈ విషయాన్ని కూడా అటవీశాఖ అధికారుల దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకువెళ్లింది. వారు నింపాదిగా వచ్చేసరికి జింక కళేబరం మాయమైంది. ఏమైందని ఆ శాఖ అధికారులను అడిగితే.. 'మా అధికారి ఒకరు వచ్చి పూడ్చిపెట్టారు..' అని సమాధానమిచ్చారు. 'పూడ్చిన ఫొటో ఇవ్వండి సర్' అని అడిగితే.. 'మా వాడి వద్ద కీ ప్యాడ్ సెల్ మాత్రమే ఉంది. ఫొటో తీయలేదు..' అన్నారు. ఇంతకూ జింక ఖననమైందా..? ఖతమైందా..? అనే అనుమానాలు కలుగుతున్నాయి.

జోరుగా బీజేపీ ప్రచారం



కుడితినిలో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్

కంప్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలోని 3వ వార్డు కౌన్సిలర్ దుగ్గెప్ప బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతప్ప గెలుపు కోసం జోరుగా ప్రచారం చేపట్టారు. దుగ్గెప్ప మాట్లాడుతూ కేంద్రంలోను, రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వాలు ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమైంది. ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపిస్తే మరింత నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వారితోపాటు పలువురు బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నూతన డైరెక్టర్లకు ధ్రువీకరణ పత్రాలు

సిరుగుప్ప, అక్టోబరు 6: ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లకు ధ్రువీకరణ పత్రాలను ఉప ఎన్నికల అధికారి అబ్దుల్ ఆజాద్ పంపిణీ చేశారు. బుధవారం సిరుగుప్ప పట్టణం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అధ్యక్షులుగా పోటీ చేసే అభ్యర్థులకు 7వ తేదీ ఆఖరు అని ఆయన తెలిపారు. అధ్యక్షులు ఓటింగ్‌కు తప్పనిసరిగా సర్టిఫికెట్లను పోలింగ్ కేంద్రానికి తీసుకురావాలని ఆయన సూచించారు.

టీబీ ఆనకట్టను పరిశీలించిన బోర్డు అధ్యక్షుడు

క్రస్ట్‌గేట్ల ఏర్పాటుపై సమాలోచన..



క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బోర్డు అధ్యక్షుడు పాండే

బళ్లారి గాంధీనగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం, కుడికాలువల సంపూర్ణ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన తుంగభద్ర మండలి అధ్యక్షుడు ఎస్.ఎన్.పాండే మంగళవారం ఆనకట్టను పరిశీలించారు. తాత్కాలిక గేటు ఏర్పాటు చేసిన 19వ క్రస్ట్‌గేటు ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. తుంగభద్ర జలాశయం నిర్మించి 70ఏళ్ళు పూర్తి అయినా ఒక్కసారి కూడా గేట్లు మార్చలేని, జలాశయానికి ఏర్పాటు చేసిన 33 క్రస్ట్‌గేట్ల స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు చేయాలని కేంద్ర జలవనరుల మండలి(సీడబ్ల్యూసీ)మాజీ అధ్యక్షుడు ఏకేబజాజ్ నేతృత్వంలో నిపుణుల బృందం ఇచ్చిన నివేదికల నేపథ్యంలో మండలి అధ్యక్షుడు జలాశయం సందర్శనం ప్రాధాన్యత సంతరించుకుంది. పాండే ఇదే సమయంలో హెచ్ఎల్‌సీ కాలువల స్థితిగతులను పరిశీలించారు. తోరణగల్లు వరకు కాలువ మార్గం గుండా బోర్డు అధికారులు, ఇంజనీర్లతో చర్చించారు. సాయంత్రం తుంగభద్ర జలాశయం ఆనయకట్టకు చేరుకున్న ఆయన జలకళతో తొణికిసలాడుతున్న జలాశయం, క్రస్ట్‌గేట్ల స్థితిగతి గురించి అధికారుల నుంచి సమాచారం సేకరించారు. జలాశయం వద్ద ఏర్పాటు చేసిన ఉద్యానవనం, జింకల పార్కులను సందర్శించి పరిశీలించారు. అధ్యక్షులతో మండలి కార్యదర్శి ఓ.ఆర్.కె రెడ్డి, కార్యనిర్వాహక ఇంజనీరు రవిచంద్ర, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్ జ్ఞానేశ్వర్, ఎస్‌డీఓ రాఘవేంద్ర పాల్గొన్నారు. బృందంలో ఏకే బజాజ్, కేంద్ర జలవనరుల శాఖ రిటైర్డ్ డైరెక్టర్ హరీశ్ కుమార్, తుంగభద్ర స్టీల్ ప్రాడెక్ట్ కంపెనీ రిటైర్డ్ అధికారి సుధాకర్ తారాపురం, కర్ణాటక జలవనరుల శాఖ రిటైర్డ్ కార్యదర్శి సిద్ధగంగప్ప, అనంతపురం ముఖ్య ఇంజనీరు నాగరాజు, తెలంగాణ ముఖ్యఇంజనీరు బాలమురళి కృష్ణలతో కూడిన బృందం సెప్టెంబర్ 29వ తేదీన కేంద్ర జలవనరుల శాఖకు నివేదిక అందజేసిన తరువాత అధ్యక్షుడు ఎస్.ఎన్.పాండే తుంగభద్ర జలాశయాన్ని సందర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

సర్ సీవీ రామన్ (జయంతి)



శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ 1888 నవంబరు 7న తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లిలో జన్మిం చారు. సీ రాజగోపాలాచారి, సర్వే పల్లి రాధాకృష్ణన్‌లతో కలసి 'భారత రత్న' అందుకున్న తొలి వ్యక్తి. ఆసియా ఖండంలో సైన్స్‌లో నోబెల్ పురస్కారం అందుకున్న తొలి వ్యక్తికావడం విశేషం. భౌతిక శాస్త్రం లో పారదర్శక వస్తువులో 'కాంతి తరంగం' ప్రస రిస్తుందనే అంశంపై ఆవిష్కరణ 'రామన్ ఎఫెక్ట్‌'గా పేరొందింది. ఆవిష్కరణ రోజును 'నేషనల్ సైన్స్ డే' గా కేంద్ర ప్రభుత్వం ఆచరిస్తోంది. బెంగళూరులో ఏర్పాటైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐ ఎస్‌సీ)కు 1933లో తొలి దేశ డైరెక్టర్‌గా వ్యవహరిం చారు. ఎన్నో పురస్కారాలు అందు కున్నారు. 1970 నవంబరు 21న కన్నుమూశారు. 2013లో ఆయన 125వ జయంతి గూగుల్ డూడుల్ ఏర్పాటు చేసింది.

ఆచార్య ఎన్‌జీ రంగా (జయంతి)



పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత, భారత రైతాంగ ఉద్య మ పితా మహగా పేరొందిన ఆచార్య ఎన్‌జీ రంగా 1900 నవంబరు 7న గుం టూరు జిల్లా నిడుబ్రోలులో జన్మిం చారు. అసలు పేరు గోగినేని రంగ నాయకులు. స్వాతంత్ర్య సమర యోధుడు. రైతు కూలీ ఉద్యమానికి నాయ కత్వం వహించారు. అంత ర్జాతీయ ఉత్పత్తిదారుల సమాఖ్య వ్యవస్థాపకులలో ఒకరు. రాజాజీతో కలిసి కిసాన్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. భారత రాజ్యాం గ పరిషత్ సభ్యుడిగా రాజ్యాంగ రచనలో అనేక సలహా, సూచనలు చేశారు. ఎన్నో స్ఫూర్తిదాయక రచనలు, పుస్తకాలు రాశారు. లోక్‌సభ సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగాను వ్యవ హ రించారు. 1995 జూన్ 8న తుదిశ్వాస విడిచారు. ఆయన పేరుతో జాతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటైంది.

మాస్టర్ కేపీకే (జయంతి)



డాక్టర్ కే పార్వతి కుమార్ (కేపీకే) 1945 నవంబరు 7న విజయవాడలో జన్మించారు. ప్ర ముఖ చార్టర్డ్ అకౌంటెంట్. విశాఖ పట్నం, హైదరాబాద్, చెన్నైలలో శాఖలున్నాయి. ఆంధ్రా విశ్వవిద్యా లయం గౌరవ ప్రొఫెసర్‌గా సేవలందించారు. డాక్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్యతో కలసి 18ఏళ్లపాటు పని చేశారు. సామాజిక సేవలో భాగంగా వందకుపైగా గ్రూపులలో సభ్యుడిగా ఉంటూ 27 దేశాలలో పర్య టించి ధ్యానం, యోగా, ఆస్ట్రాలజీ, హీలింగ్ తదతర అంశాలపై 200 రచనలు చేయడంతోపాటు 500కు పైగా సదస్సులు నిర్వహించారు. 2022 నవంబరు 1న కన్నుమూశారు.

కమల్‌హాసన్ (పుట్టినరోజు)



దక్షిణాది ప్రముఖ నటుడు పద్మ భూషణ్ గ్రహీత కమల్‌హాసన్ 1954 నవంబరు 7న జన్మించారు. ఆయన అసలు పేరు పార్థసారథి శ్రీని వాసన్. నటుడు, దర్శకుడిగా, నిర్మాతగా, స్క్రీన్‌రైటర్‌గా, కొరియో గ్రాఫర్‌గా, ప్లేబ్యాక్ సింగర్‌గా లిరిసిస్ట్‌గా, బుల్లితెర హోస్ట్‌గా బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించారు. రాజకీయాల్లోనూ సత్తా చాటుకున్నారు. 4 జాతీయ అవార్డు, 9 తమిళనాడు స్టేట్‌ఫిల్మ్ అవార్డ్స్, 4 నంది, ఒక రాష్ట్రపతి అవార్డు, 18 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. కళైమామణి, పద్మశ్రీ ఇతర గౌరవాలు అందుకున్నారు.

ఉషా ఉతుప్ (పుట్టినరోజు)




ఉర్రూతలూగించే హుషారైన పాటలతో ప్రపంచవ్యాప్తంగా అభి మానులను సంపాదించు కున్న ప్రముఖ నేపథ్యగాయని ఉషా ఉతుప్ 1947 నవంబరు 7న ముంబైలో జన్మించారు. పాప్, జాజ్, సినీపాటలతో ఆమె ఖ్యాతి గడించారు. చిన్న పిల్లల కథల ఆల్బమ్స్ రూపొందించారు. తనదైన శైలి లో చక్కటి గుర్తింపు పొందారు. 'పద్మశ్రీ', 'మహిళా శిరోమణి పురస్కార్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్' తదితర పురస్కారాలను అందుకున్నారు. బుల్లితెరపై సంగీత కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరిం చారు.

త్రివిక్రమ్ శ్రీనివాస్ (పుట్టిన రోజు)



కలం పేరు త్రివిక్రమ్ శ్రీనివాస్‌గా పేరొందిన ఆకెళ్ళ నాగ శ్రీనివాస శర్మ 1971 నవంబరు 7న భీమవరంలో జన్మించారు. స్క్రీన్ రైటర్‌గా, డైలాగ్ రైటర్‌గా, దర్శకుడిగా తెలుగు సినిమా రంగంలో చక్కటి గుర్తింపు పొం దారు. అభిమానులు ఆయనను 'మాటల మాంత్రి కుడి'గా అభివర్ణిస్తారు. 'నువ్వే కావాలి'లో మాటల రచయితగా నేషనల్ ఫిలిం అవార్డు, 'నువ్వే నువ్వే' చిత్రం నంది పురస్కా రాన్ని గెలిచింది. బిఎన్ రెడ్డి నేషనల్ అవార్డుతోపాటు నంది, ఫిల్మ్‌ఫేర్ అవార్డులు ఇతర గౌరవాలు అందుకున్నారు. దర్శకత్వం వహించిన అత్తారింటికి దారేది, సన్నాఫ్ సత్యమూర్తి, అల వైకుంఠపురంలో సినిమాలు బాక్సాఫీస్ హిట్‌గా నిలిచాయి.

అనుష్క శెట్టి (పుట్టినరోజు)



దక్షిణాదిన లేడీ సూపర్‌స్టార్‌గా పేరొందిన నటి అనుష్క శెట్టి కర్ణాటక రాష్ట్రం మంగళూరులో 1981 నవంబరు 7న జన్మించారు. సినీరంగంలో అత్యధిక పారి తోషికం తీసుకునే నటి. తెలుగు, తమిళ సినిమాల్లో ప్రముఖ హీరోల సరసన నటిం చారు. బహుభాషల్లో నిర్మితమైన మెగా హిట్ సినిమా 'బాహుబలి'లో దేవసేనగా నటించారు. అద్భుత నటనకుగాను పలు అవార్డులను సొంతం చేసుకు న్నారు. 50కుపైగా సినిమాల్లో నటించి రెండు నంది, ఇంకా 'సినిమా' అవార్డ్స్, తమిళనాడు స్టేట్ ఫిలిం అవార్డ్స్ ఇతర పురస్కారాలు అందుకున్నారు.

కైవార తాతయ్య ఆలయ నిర్మాణానికి భూమిపూజ

బాగేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాగేపల్లి హోబళి పరగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తకోటి గ్రామంలో యోగినారేయణ సేవా ట్రస్టు ఆధ్వ ర్యంలో తలపెట్టిన కైవార తాతయ్య ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కైవార తాతయ్య ఆలయ ధర్మాధికారి ఎంఆర్ జయరాం, బాగేపల్లి ఎమ్మెల్యే సుబ్బారెడ్డి, ఆలయ ట్రస్టు పదాధికారులు భూమిపూజలో పాల్గొన్నారు. గ్రామస్థులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఎంఆర్ జయరాం మాట్లాడుతూ గురువును భక్తితో శరణాగతి కావడం ద్వారా మన జీవన గమనానికి మార్గదర్శకం చేస్తారన్నారు. మానవజన్మను సార్థకం చేసుకోవాలంటే గురువు అనుగ్రహం ఉండాలన్నారు. మనలోని చెడులను తొలగించే శక్తి గురువుకు మాత్రమే ఉందన్నారు. దేవస్థాన నిర్మా ణానికి అందరూ సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణం చేపట్టడం గొప్ప కాదని ఆలయంలో నిత్యం దీపధూపనైవేద్యాలు నిర్వహించడం ఇప్పు డు ఒక సవాల్‌గా మారిందన్నారు. కార్యక్రమంలో అరకెరె కృష్ణారెడ్డి, జీహెచ్ నాగ రాజ్, యోగినారాయణ ట్రస్టు సభ్యులు నరసింహయ్య, బలిజ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో కైవార ధర్మాధికారి ఎంఆర్ జయరాం, ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

లోకకల్యాణార్థం అతిరుద్ర మహాయజ్ఞం



వేదపారాయణలో పాల్గొన్న వైదికులు

దొమ్మసంద్ర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): లోకకల్యాణార్థం అతిరుద్ర మహా యజ్ఞం చేపట్టారు. కల్యాణనగర్‌లోని సురభారతి సంస్కృత, కల్చరల్ ఫౌండేషన్ ఆవరణలో హృదయస్పందన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అతిరుద్ర మహాయజ్ఞం, శతచండిహోమం, నాలుగు వేదాల పారాయణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గురు ప్రార్థన, శారదాదేవి పూజా, ద్వార పూజ, యాగశాలా ప్రవేశం, మహాగణపతి పూజ, వాస్తుపూజ, మహాసంకల్పం, పుణ్యాహం, అతిరుద్ర కళశ స్థాపన, గోదానం, సహస్ర మోదక గణపతిహోమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా 200కుపైగా వైదిక పండితులు విచ్చేశారు. సురభారతి సంస్థ కే శ్రీనివాసన్ మార్గదర్శకంలో ప్రభాకర శర్మ నిర్వహించారు. హృదయ స్పందన సంస్థ ప్రసాద్ మాట్లాడుతూ లోకకల్యాణార్థం శతచండీ హోమం, పూర్ణాహుతి నిర్వహించామని ఈనెల 15న అతిరుద్ర మహాయజ్ఞం ఉంటుందన్నారు. ట్రస్టీ సాయిరా హరిశంకర్ మాట్లాడుతూ సత్యసాయిబాబా ఆశీర్వాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈనెల 9, 10 తేదీలలో ప్రత్యేక సంగీత కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మసీదును చూసేందుకు రండి

9న ప్రత్యేక కార్యక్రమం

బంగారపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మన ఊరి మసీదును చూసేం దుకు రావాలనే ప్రత్యేక కార్యక్రమం ద్వారా సమాజంలో భావైక్యత, సౌహార్దత పెంపొందిస్తున్నామని జమాతె ఇస్లామి హింద్ అధ్యక్షుడు ముబారక్ బాగఖాన్ అభిప్రాయపడ్డారు. పట్టణంలో జమాతె ఇస్లామి హింద్ కార్యా లయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈనెల 9న శనివారం ఉదయం 10.30 గంటలనుంచి సాయంత్రం 4వరకు బజార్ రోడ్డులోని దొడ్డ మసీదులో దర్శన కార్యక్రమం ఉంటుందన్నారు. అన్నివర్గాల స్త్రీ పురు షులు విచ్చేసి మసీదులో జరిగే ప్రార్థనలు, ఇతర కార్యక్రమాలను వీక్షించ వచ్చునన్నారు. ప్రజలలో నెలకొన్న తప్పుడు భావాలను దూరం చేయ డమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా రఫీక్, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో ముబారక్ బాగఖాన్ తదితరులు

తెగుళ్లతో మిరప రైతు కుదేలు..!

కంప్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో మిరప సాగు చేసిన రైతు లకు కష్టాలు తప్పడం లేదు. పంట బాగా ఎదిగినా తెగుళ్లతో రైతులు అల్లాడిపోతు న్నారు. తుంగభద్ర జలాశయం కుడికాలువ కింద సిద్దమ్మనహళ్లి, మారుతీ క్యాంపు, ఎర్రంగళి, ఏకుబెంచి, ఎస్‌ఆర్ పురం, తదితర గ్రామాలలో మిరప పంటకు బ్లాక్ ట్రిప్స్ వైరస్ సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు కాయమచ్చ, ఆకుమచ్చ, బొబ్బర్, ఇతర తెగుళ్లు సోకి పంటలు పూర్తిగా నష్టపోతున్నారు. తెగు ళ్లతో పంటలు దిగుబడి రాక పూర్తిగా కష్టాల్లో వుండిపోయారు. తెగుళ్లతో పెట్టుబ డులు ఎక్కువయ్యాయని, ఒకసారి పిచికారి చేస్తే ఎకరాకు రూ.3 వేల నుంచి రూ.4 వేలు ఖర్చవుతోందని వాపోతున్నారు. పంటలు 5531, 2043, బ్యాడిగి, డబ్బీ రకం, 101, 102 రకాల మిరప పంటలకు పూర్తిగా తెగుళ్లు సోకి తీవ్ర నష్టపోయారు. సొంత రైతులకు ఒక బాధ అయితే కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. కౌలు రైతులు పంట పెట్టుబడులతో పాటు రూ.50 వేలు ఎకరాకు చెల్లించి కౌలు చేస్తున్నారు. దీంతో మొత్తం పంట పోయి, కౌలు చెల్లించి తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. విషయం తెలుసుకున్న తోటగారి సహాయ అధికారి కరేగౌడ బుధవారం శ్రీరామరంగాపురం చేరుకుని అక్కడ పంటలను పరిశీలించారు. బ్లాక్ ట్రిప్స్‌తో పాటు వివిధ తెగుళ్లు కూడా సోకడంతో రైతులు నష్టపోయింది కూడా నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 90 నుంచి 30 సెంటీమీ టర్లు లేక 60 నుంచి 45 సెంటీమీటర్లు కొలతలు తీసుకుని రసాయనిక ఎరువులు మోటోరైజీయం, అనిస్లోఫియా మందులు పిచికారి చేయాలన్నారు. అలాగే 1 కేజీ 2 కేజీ పొలంలో మర్దన చేయాలన్నారు. వాటితో పాటు వేపరసం ఎకరాకు 200 కిలోలు వాడాలన్నారు. అలాగే సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. అప్పుడు తెగు ళ్లను కొద్దిమేర నివారించవచ్చునన్నారు. ఈ యేడాది వర్షాలు అధికంగా రావడంతో తెగుళ్లు సోకాయని అన్నారు. రైతు సుబ్బయ్య మాట్లాడుతూ ఇప్పటికే గతంలో మిరప కాయలకు రేట్లు లేక వెయ్యి కిలోలు స్టాకు ఉంచామన్నారు. పలు షాపుల వద్దకు వెళ్లాలన్నా రసాయనిక ఎరువులు గానీ, మందులు గానీ ఇచ్చేందుకు వెను కంజ వేస్తున్నారన్నారు. పాత లెక్కలే కట్టలేదని ఈ లెక్కలు ఎప్పుడిస్తారని ప్రశ్నిస్తు న్నారు. గతంలో కాలువకు నీరు లేక నష్టపోయామని, ఈ యేడాది నీటి శాతం ఎక్కువై పూర్తిగా నష్టపోయామని తెలిపారు.



తెగుళ్లు సోకిన మిరప పంట



పరిశీలిస్తున్న అధికారి కరేగౌడ

ప్రతిభను ప్రోత్సహించాలి

శిడ్లఘట్ట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు విద్యాశాఖ ఈసీఓ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని వాసవి విద్యాసంస్థ ఆవరణలో ఏర్పాటైన ప్రతిభాకారంజి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విద్యాసంస్థ పాలనాధికారి రూపసి రమేశ్ కేవలం పాఠాలకే పరిమితం కాకుండా సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. 17మంది పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ముమియాబేగం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. పరిమళ, దేవేంద్ర, రవిచంద్ర మౌళి, శివకుమార్, సీకే రవి, ముని నారాయణస్వామి, ప్రతీశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభాకారంజిలో మంజునాథ్ తదితరులు

తాలూకా అధ్యక్ష స్థానానికి నామినేషన్



వివిధ స్థానాలకు నామినేషన్లు వేస్తున్న అభ్యర్థులు

బంగారపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 2024-29 అవధికి తాలూకా శాఖకు అధ్యక్ష, కోశాధికారి, రాష్ట్ర పరి షత్ సభ్య స్థానానికి బుధవారం నామినేషన్ సమర్పించారు. అధ్యక్ష స్థానానికి ఆరోగ్యశాఖ నుంచి రవికుమార్, విద్యాశాఖ నుంచి కోశాధికారి స్థానానికి వెంక టేశ్, విద్యాశాఖ నుంచి రాష్ట్ర పరిషత్ స్థానానికి అప్పయ్యగౌడ నామి నేషన్ సమర్పించినట్టు ఎన్నికల అధికారి మంజునాథచారి తెలిపారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఆంజ నేయ గౌడ, హెచ్‌వీఎస్ నారాయణ స్వామి, శంకరప్ప, సంజీవప్ప, శ్యామ్ మూర్తి, ప్రేమలతా, నారాయణస్వామి, ముని నారాయణ, కాంతరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి పరిశీలన

శిడ్లఘట్ట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి డాక్టర్ ఎన్ మంజుళా బుధవారం అకస్మికంగా పరిశీలించారు. పట్టణ శివారులోని ఆనూరు ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి మౌలిక సదుపాయాల స్థితిగతులను పరిశీలించారు. తాగునీరు, శౌచాలయం, ఇతర సదుపాయాలను పరిశీలించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి పిఎస్ రవీంద్ర, జిల్ల పంచాయతీ సీఈఓ ప్రకాశ్ నిట్టాళి, ఇన్‌చార్జ్ జిల్లా అధికారి డాక్టర్ ఎన్ భాస్కర్, విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ బైలాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.



ఆనూరు ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతాధికారులు

పన్ను వసూళ్లపై నిరసన

మహదేవపుర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేఆర్‌పుర పరిధిలోని సంత ప్రాంతంలో హద్దులుదాటి పన్ను వసూళ్లు చేస్తున్నారని ఆరోపిస్తూ అఖిల కర్ణాటక రైతులు, వ్యాపారుల సమాఖ్య ఆధ్వర్యంలో బీబీఎంపీ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. డివిజన్ కమిషనర్ రమేశ్‌కు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ శ్రీనివాస్ వినతి పత్రం సమర్పించారు. సంత పరిధి లో 1.14 ఎకరాలు ఉండగా అంతకుమించి పన్ను వసూళ్లు చేస్తున్నారని శ్రీనివాస్ మండిపడ్డారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసినా ప్రయో జనం లేకపోయిందన్నారు.



డివిజన్ కమిషనర్‌తో సమాఖ్య ప్రతినిధుల చర్చలు

రాజకాలువలో లారీ బోల్తా



ఘటనా స్థలంలో స్థానికులు

బంగారపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బంగారపేట - బూదికోటె మార్గంలో పట్టణంలోని న్యూటౌన్ వద్ద వాహనం అదుపుతప్పి లారీ బోల్తా పడింది. లారీ తమిళనాడునుంచి పట్టణానికి సరుకు రవాణా తరలిస్తోంది. లారీ అకస్మాత్తుగా అదుపు తప్పి రోడ్డడపక్కనగల రాజ కాలువలోకి పడిపోయింది. గాయపడిన లారీ డ్రైవర్, క్లీనర్‌లను ఆసు పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని బంగారపేట పోలీసులు పరిశీలించారు.

రెవెన్యూ ఉద్యోగి ఆత్మహత్య కేసులో

మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పీఏపై ఎఫ్ఐఆర్

బెంగళూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బెళగావి తహసీల్దారు కార్యాలయంలో ఉద్యోగి రుద్రప్ప యడవణ్ణ ఆత్మహత్య చేసుకున్న కేసులో స్త్రీశిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పిఏ సోముపై మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రుద్రప్ప భార్య గిరిజ ఫిర్యాదు మేరకు బెళగావి తహసీల్దారు బసవరాజ్ నాగరాల్, ఎఫ్ డిసి అశోక్ కబ్బళిగేర్‌లతోపాటు మంత్రి పీఏ సోములపైనా ఎఫ్ఐ ఆర్ నమోదైంది. కేసు నమోదు కాగానే ముగ్గురూ పరారీలో ఉన్నా రు. వీరికోసం పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. రుద్రప్ప భార్య గిరిజ మీడియాకు తెలిపిన మేరకు సోమ వారం రాత్రి ఫోన్ చేశారని, బదిలీ చేశారని భయం కలుగుతోందని తెలి పారన్నారు. కాగా రుద్రప్ప తల్లి మాట్లాడుతూ ఇంట్లో భోజనం చేస్తుండగానే ఓ ఫోన్‌కాల్ వచ్చిందని, వెంటనే నగదు తీసుకుని వెళ్లిపోయారని మళ్లీ నా బిడ్డ శవమై కనిపించాడని మండిపడ్డారు. ఇదే విషయమై మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ బెళగావిలో స్పందిస్తూ తప్పు చేసినవారికి శిక్ష పడాల్సిందే అన్నారు. బీజేపీ నాయకులు సహా పలువురు మంత్రి రాజీనామా కోరుతున్నారనే విషయమై స్పందిస్తూ గతంలో బీజేపీ పాలన ఉన్నప్పుడు ఓ కంట్రాక్టర్ ఆత్మహత్య చేసుకుంటే ఈశ్వరప్ప మంత్రి పదవికి రాజీనామాను ఈ కేసుతో పోల్చలేమన్నారు. అప్పట్లో కంట్రాక్టర్ నేరుగా ఈశ్వరప్పపేరు ప్రస్తావించారన్నారు. కాగా రుద్రప్ప నాతో ఎప్పుడూ మాట్లాడలేదని, నన్ను సంప్రదించలేదన్నారు. ఆయనతో ఎవరు మాట్లాడారో, ఎలాంటి చర్చలు జరిగాయో, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలన్నారు.

యువతి పట్ల అసభ్య ప్రవర్తన

సోషల్ మీడియాలో పోస్ట్

బెంగళూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బీటీఎం లే అవుట్‌లో హిందీ మాట్లాడుకుంటూ ఓ యువతి లైవ్ బ్లాగ్ చేస్తుం డగా అటుగా సైకిల్‌పై వచ్చిన ఓ యువకుడు అసభ్యంగా ప్రవ ర్తించాడు. ఇదే అంశంపై సోషల్‌మీడియాలో యువతి కంట తడిపెట్టి పోస్ట్ చేశారు. ఉత్తరభారత్‌కు చెందిన నేహా బిస్వాల్ అనే యువతి నగరంలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని ఇంటికి నడిచి వెళ్తూ బ్లాగ్ వీడియో చేస్తున్నారు. ఇదే సమయంలోనే సైకిల్‌పై వచ్చిన ఓ యువకుడు హాయ్ అంటూ సమీపానికి వచ్చి ఛాతీ భాగంలో తాకి పరారయ్యాడు. సోమవారం జరిగిన సంఘటనపై వీడియో ద్వారానే యువతి వాపోయారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ యువతికి లక్షలాదిమంది ఫాలోవర్స్ ఉన్నారు. బెంగళూరులోని పబ్, క్లబ్, షాపింగ్‌మాల్, బీటీఎం లే అవుట్, మడివాళతోపాటు పలు ప్రదేశాల ప్రత్యేకతలను వీడియో తీసి పోస్ట్ చేస్తుంటారు. తాజా సంఘటన బాధ కలిగిందని బీటీఎం లే అవుట్‌లో ఇటువంటి పరిణామం ఎప్పుడూ చూడలేదని, భావనాత్మకమైన వీడియోను పోస్ట్ చేశారు. నెటిజన్‌లు తీవ్ర స్థాయిలో యువకుడి తీరును తప్పుబట్టారు. బెంగళూరులో యువ తులకు రక్షణ లేదని మండిపడ్డారు. అయితే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నేహా తన వీడియోను తొలగించారు.

బీమా సొమ్ము కోసం బంధువు హత్య

నలుగురు నిందితుల అరెస్టు

బెంగళూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమీప బంధువు పేరి ట ఇన్సూరెన్స్ పాలసీ చేయించి దారుణంగా హత్య చేసి రూ.40లక్షలు కాజేయాలనుకున్న వారిని పోలీసులు ఒక్కరోజులోనే అరెస్టు చేశారు. దావణగెరెలోని బంబూబజార్ నివాసి దుగ్గేశ (42)ను సోమవారం అరెస్టు చేశారు. దుగ్గేశ సమీప బంధువు గణేశ్ దావణగెరెలోని ఓ ప్రైవేట్‌బ్యాంకులో రూ.40లక్షలకు ఇన్సూరెన్స్ చేశారు. పథకం ప్రకారం ఊపిరాడకుండా చేసి హతమార్చారు. ఆ తర్వాత మృతదేహాన్ని అతడి ఇంటివద్దకు తీసుకెళ్లి అనారోగ్యంతో మృతి చెందాడని నమ్మించారు. ఆజాద్‌నగర్ పోలీసులు అను మానాస్పదంగా భావించి కేసు నమోదు చేశారు. దుగ్గేశికి ఎటు వంటి ఆదాయం లేకున్నా రూ.40లక్షల బీమా పాలసీ చేయిం చడంపై పోలీసులు అనుమానించారు. గణేశ్ (24), శివకుమార్ (25), హళేచిక్కనహళ్ళి అనిల్, భారత్ కాలనీ మారుతి (24)లను అరెస్టు చేయగా హత్య విషయాన్ని అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసిన బృందాన్ని జిల్లా ఎస్పీ ఉమాప్రశాంత్ ప్రశంసించారు.

బస్సు నడుపుతూ.. గుండెపోటుతో డ్రైవర్ మృతి

బెంగళూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నెలమంగల నుంచి దాసనపుర డిపోకు వెళ్తున్న బీఎంటీసీ బస్సు డ్రైవర్‌కు గుండెపోటు వచ్చి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బస్సు నడుపుతుండగా ఒక్కసారిగా డ్రైవర్ కిరణ్‌కుమార్ (38)కు గుండెపోటు వచ్చింది. వెంటనే కండక్టర్ ఓబులేశ్ అప్రమత్తమై క్షణాల్లోనే బ్రేక్ వేశాడు. బస్సు నిలిచిపోగా అక్కడనుంచి డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్‌లు తెలిపారు. డ్రైవర్ కిరణ్‌కుమార్ హాసన్‌కు చెందినవారు. కండక్టర్ చాకచక్యంగా ప్రమాదాన్ని నియంత్రించినట్టయ్యింది.

ఆనేకల్‌లో పెరుగుతున్న దాడులు

నియత్రించాలని ప్రజల వినతి

దొమ్మసంద్ర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన ఆనేకల్ పట్టణంలో వీధిరౌడీల ఆగడాలు అధికమవుతున్నాయి. మద్యం మత్తులో ఒక వ్యక్తిని తీవ్రంగా గాయపరిచిన సంఘటన సీసీటీవీ ఫుటేజీలలో వెలుగులో చూసింది. పట్టణంలోని తళి రోడ్డు లోని హేమంత్‌బార్ సమీపాన ఈనెల 3న ఘటన చోటు చేసు కుంది. కేబీఆర్ బార్ మేనేజర్ మను, అతడి సోదరుడు ప్రతాప్‌లు దాడులకు గురయ్యారు. శివు, అతడి గ్యాంగ్ రక్తం కారేలా దెబ్బలు కొట్టారు. రోడ్డుపైనే కారు ఆపి అట్టహాసం చేసిన సంఘటన సీసీటీవీ ఫుటేజీలో నమోదైంది. బాధితుడి మను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, పీకలదాకా తాగిన రౌడీలు చేస్తున్న ఆగడాలను పోలీసులు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,605.65
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15.536	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	15,116	9,052
నీటి నిల్వ (టీఎంసీలు)	101.77	29.76

సంక్షేమ పథకాలు పేదలకు వరం



వీధి నాటకం ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

బళ్లారి సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు పేదలకు మేలు చేస్తాయని నాయకుడు పంపన గౌడ అన్నారు. బళ్లారి తాలూకా సంగనకల్లు గ్రామంలో సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం వీధినాటకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ప్రశంసనీయమైన శక్తి యోజన కింద బస్సు ప్రయాణం, గృహిణులకు నెలకు రూ.2వేలు, గృహ జ్యోతి యోజన, అన్నభాగ్య, యువ నిధి కింద ఇంటింటికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో వీధినాటకం ద్వారా తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప, బిల్ కలెక్టర్ హులుగప్ప, గ్రామ పెద్దలు కే శంకరప్ప, మల్లికార్జున, ఈశ్వర్‌గౌడ, కళాకారులు హులుగప్ప, రమేశ్, బి.ఆనంద్, ఎర్రిస్వామి, హేమంత్,తాయప్ప, గంగమ్మ, రూతమ్మ పాల్గొన్నారు.

ఓబవ్వ జయంతిని నిర్వహించాలి

- ఏడీసీ మహమ్మద్ జుబేర్



మాట్లాడుతున్న ఏడీసీ మహమ్మద్ జుబేర్

బళ్లారి సిటీ, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల 11వ తేదీన జిల్లా కేంద్రంలో వీర వనిత ఒనకే ఓబవ్వ జయంతిని అర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహాలు చేయాలని ఏడీసీ మహమ్మద్ జుబేర్ సూచించారు. కలెక్టర్ కార్యాలయ హాల్లో బుధవారం నిర్వహించిన ఒనకే ఓబవ్వ జయంతి ప్రాథమిక సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నవంబరు 11న ఉదయం 11గంటలకు జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో వేదిక కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పక పాల్గొనాలని ఆదేశించారు. కార్యక్రమంలో కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కనకదాస జయంతికి ఏర్పాట్లు పూర్తి చేయాలి



అధికారులతో సమావేశమైన ఏడీసీ శివానంద భజంత్రి

రాయచూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో 18వ తేదీన నిర్వహించే కనకదాస జయంతికి ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు జిల్లాధికారి శివానంద భజంత్రి అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ జయంతిని విజయవంతం చేయాలన్నారు. కనకదాస జయంతి నిర్వహణకు సంబంధించి బుధవారం జిల్లాధికారి కార్యాలయంలో పూర్వసిద్ధతసమావేశం నిర్వహించారు. ఏడీసీ మాట్లాడుతూ జయంతి రోజున నగరంలోని గంజ్ సర్కిల్‌లో ఉన్న వాగ్గేయకారుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించే కార్యక్రమం అనంతరం కనకదాస చిత్రపటం ఊరేగింపు ఉంటుందన్నారు. ఊరేగింపులో జానపద కళాకారులు, వివిధ వేషధారణలతో పాటు మేళతాళాలు భజంత్రిలు ఉండేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

సై అంటే సై..!

- సంతోష్‌లాడ్ జిత్తులు... గాలి ఎత్తులు..!
- పోటాపోటీగా ప్రచారాలు
- రసవత్తరంగా సండూరు ఉప ఎన్నిక రాజకీయం

బళ్లారి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సండూరు శాసనసభ ఉప ఎన్నికల రాజకీయ ఆసక్తికరంగా మారింది. అభ్యర్థులు డమ్మీలైనా వారి గెలుపునకు ఇరు పార్టీలు ఎత్తుకు పై ఎత్తు వేస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ తుకారాం గెలుపునకు మంత్రి సంతోష్ లాడ్ అలియాస్ దాదా, బీజేపీ అభ్యర్థి గెలుపునకు ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి పోటా పోటీగా ప్రచారం చేస్తున్నారు. పార్టీల అభ్యర్థులను పక్కకు పెడితే సండూరులో ఈ ఇద్దరి రాజకీయమే ఆసక్తిగా మారింది. సంతోష్ లాడ్, గాలి జనార్దన్‌రెడ్డి ఇద్దరూ రాజకీయంగా ఆరితేరిన వారే. పైగా ఎత్తులు, జిమ్మిక్కులు వేయడంలో ఇద్దరిలో ఎవరూ తీసిపోరు.



కాంగ్రెస్ నాయకులను బీజేపీలో చేర్చుకుంటున్న గాలి జనార్దన్ రెడ్డి

మంత్రి సంతోష్ లాడ్‌ను ఈ ప్రాంత జనం అందరూ దాదా అని ముద్దుగా, పిలుచుకుంటారు. అందరినీ ఆప్యాయంగా పలకరించడం ఆయన నైజం. పైగా చురుకైన వాడు. ఎత్తులు, జిత్తులు వేయడంలో నేర్పరి. కాలంతో పాటు ముందు జరిగే పరిస్థితులను అంచనా వేయగలిగే రాజకీయ నాయకుడు. కాంగ్రెస్ పార్టీ కూడా సండూరులో సంతోష్ లాడ్ మాట కాదనదు. ఆయన ఎవరికి టిక్కెట్ అంటే వారికే ఇస్తుంది. ఇప్పుడు ఇదే జరిగింది. సండూరు ఉప ఎన్నికలో సంతోష్ లాడ్ చెప్పిన తుకారాం భార్యకే పార్టీ టిక్కెట్ ఇచ్చింది. దీంతో గెలుపును ఆయన ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఓడినా, గెలిచిన అంతా తనపైనే కావున అనేక వ్యూహాలు పన్నుతున్నారు.



మహిళా ఓటరుతో మాట్లాడుతున్న మంత్రి సంతోష్ లాడ్

ఇక బీజేపీ విషయానికి వస్తే సండూరు బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంత గెలుపును గాలి జనార్దన్‌రెడ్డికి అధిష్టానం అప్పగించింది. జనార్దన్‌రెడ్డి సండూరులో బీజేపీ అభ్యర్థి గెలుపునకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. గాలి తన వేగం పెంచాడు. మాటలు ఘాటు పెరిగింది. సండూరులో ఖచ్చితంగా బీజేపీ గెలిపించుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు వేసే ప్రతి అడుగూ గాలికి తెలుస్తుంది. కొందరిని కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేర్చుకుంటే మరుసటి రోజే దాదా వాళ్లనే తిరిగి కాంగ్రెస్ లో చేర్చుకుని కండవా వేస్తున్నారు. ఇలా ఇద్దరూ ఎత్తులు,రాజకీయ జిమ్మికులు వేస్తూ రాజకీయ చదరంగం ఆడుతున్నారు. అయితే గెలుపు ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

యువత నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలి



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యువత నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలని జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్ శరణప్ప అన్నారు. కర్ణాటక ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పంచాయతీ స్కిల్ స్కీమ్ కింద జిల్లా వాణిజ్య పరిశ్రమల సంస్థ నైపుణ్యాభివృద్ధి కేంద్రం కామర్స్ గ్రాడ్యుయేట్లకు రెండు నెలల ఉచిత టాలీ ప్రైమ్ నైపుణ్య శిక్షణను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వాణిజ్య, పరిశ్రమల సంస్థ యువతకు అవసరమైన టాలీ వినియోగ నైపుణ్య శిక్షణను అందిస్తోందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్లాస్ రూంలో నేర్చుకున్న విజ్ఞానానికి, పరిశ్రమలోని అవసరాలకు మధ్య చాలా అంతరం ఉంటుందన్నారు. ఈ అంతరాన్ని తగ్గించడానికి నైపుణ్యం అవసరమన్నారు. నిపుణుల నుంచి టాలీకి ఉపయోగించే నైపుణ్యాలను పొందడ ద్వారా సులభంగా ఉద్యోగాలను సాధించవచ్చన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా వాణిజ్య మండలి నైపుణ్యాభివృద్ధి కేంద్రం నాణ్యమైన శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి చైర్మన్ యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి మాట్లాడుతూ యువతను నైపుణ్యంలో సమర్థులుగా తీర్చిదిద్దేందుకు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రత్యేక శిక్షణ ఇస్తోందన్నారు. సెంటర్‌లో నైపుణ్య శిక్షణ పొందిన వారికి సులభంగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. పరిశ్రమల మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యంతో కూడిన శిక్షణ పొంది విజ్ఞానంతో పాటు జీవనశైలిని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వాణిజ్య పరిశ్రమల శాఖ సంయుక్త కార్యదర్శి మల్లికార్జునగౌడ, గౌరవ కార్యదర్శి సురేశ్‌బాబు, మంజునాథ్, దొడ్డనగౌడ, నాగల్లి రమేశ్ పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుకు శ్రీచైతన్య విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో స్కూల్ యాజమాన్యం

బళ్లారి సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పదివేల మంది విద్యార్థులతో గణిత శాస్త్రంలోని 600 ఫార్ములాలను ఏక కాలంలో పఠనం చేయించి శ్రీ చైతన్యటెక్నో బళ్లారి, హొసపేట బ్రాంచ్‌లు ప్రపంచ రికార్డును సృష్టించాయి. బాల మేధావుల ప్రతిభ పాటవాలను విశ్వవ్యాప్తం చేసేందుకు యూకేకు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కలిసి ఈ ప్రత్యేకమైన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినాన్ని పురస్కరించుకుని బళ్లారి హొసపేట తదితర బ్రాంచిలలో రక్తదానం శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొని రక్తదానం చేశారు. ప్రపంచ రికార్డుకు సిద్ధమైన 10వేల మంది విద్యార్థులతో హొసపేట, బళ్లారి బ్రాంచ్‌ల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమలోఓ విద్యాసంస్థల సంస్థల డైరెక్టర్ సీమాబోపన్న, సుష్మాబోపన్న, డైరెక్టర్ నాగేంద్ర, సీఈఓ సునిల్, ఏజీఎం హరికృష్ణ, బ్రాంచ్ ప్రిన్సిపాల్ చంద్రకళ, లక్ష్మి పాల్గొని విద్యార్థులను అభినందించారు.

గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలి

సిరుగుప్ప, అక్టోబరు 6: గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలని జిల్లా ఆరోగ్య శాఖ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు సూచించారు. బుధవారం తాలుకాలోని టెక్కలకోట పట్టణం ఆరోగ్య సముదాయ భవనంలో జాతీయ సురక్షిత మాతృ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రసవ సమయంలో మహిళలు, వైద్యుల, నర్సుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ వీరేంద్ర కుమార్, ప్రహల్లాద, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టించుకోరా..?

- ఏపీఎంసీ అధికారుల నిర్లక్ష్యం
- క్లీనింగ్ పేరుతో రూ.లక్షల్లో నష్టం
- ప్రజా ప్రతినిధుల కనుసన్నల్లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- ఇబ్బంది పడుతున్న వ్యాపారులు, రైతులు



ఏపీఎంసీ మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తలో పశువులు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దొంగలు... దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్న చందాన ప్రస్తుతం బళ్లారి ఏపీఎంసీ పరిస్థితి తయారైంది. క్లీనింగ్ టెండరు ప్రక్రియ నిబంధనలు గాలికి వదిలేసినట్లు బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్ క్లీనింగ్‌కు కేటాయించిన కార్మికులను పంచుకుని పనులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో కార్మికుడికి అందాల్సిన మొత్తం అందించకుండా ఇచ్చిన దానిలో సగం నొక్కుతున్నట్లు కార్మికులు వాపోతున్నారు. ప్రస్తుతం క్లీనింగ్ డెండరు పనులు నలుగురి చేతులపై నడుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్లీనింగ్ పేరుతో నెలనెలా లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తున్నా... మార్కెట్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. టెండరు నిబంధనల ప్రకారం మార్కెట్‌లో సేకరించిన వ్యర్థాలను 5 కిలోమీటర్ల దూరంలో వేయాల్సి ఉండగా... అదేమి కాకుండా మార్కెట్ ప్రాంగణంలోనే వేయడంతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారాయి. మార్కెట్ పర్యవేక్షించాల్సిన అధికారులు కాంట్రాక్టర్లు ఇచ్చే మామూళ్లకు కక్కుర్తి పడి మిన్నకుండిపోతున్నారు. దీంతో మార్కెట్‌కు వచ్చే రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మార్కెట్ పాలనా వ్యవహారాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, వారి అనుచరుల జోక్యంతో ఏపీఎంసీ స్థితిగతుల గురించి మాట్లాడటానికి ఎవరూ ధైర్యం చేయలేకపోతున్నారు. ఈ ఏడాదిలోనే రెండు సార్లు పాలకమండలి ఏపీఎంసీ మార్కెట్ అధికార బాధ్యతలు చేపట్టింది. మొదటి సారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కట్టెమనె నాగేంద్ర మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని మొదట్లో ఏపీఎంసీలో ప్రతి రోడ్డు, ప్రతి మార్కెట్, ప్రతి వ్యాపారిని పలకరించి ఏమైనా సమస్య ఉంటే తనవద్దకు తీసుకురండి అని చెప్పినా, ఇచ్చిన హామీలు నీటిమాటలుగానే మిగిలాయి. మార్కెట్ సమితి అధ్యక్షులుగా ఎవరు వచ్చినా వారి స్వప్రయోజనాల కోసమే చూసుకుంటున్నారు మినహా... వ్యాపారుల సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కూరగాయల మార్కెట్ పరిస్థితి అధ్వానంగా ఉందని.. మార్కెట్‌లోకి విచ్చలవిడిగా వందలాది పశువులు ప్రవేశిస్తూ పరిసరాలు అపరిశుభ్రం చేస్తుంటే... మార్కెట్ ప్రాంగణంలో ఉన్న నీటి కుంటల్లో గేదెలు ఈతకొడుతూ... పరిసరాలు అపరిశుభ్రం చేస్తున్న దృశ్యాలు కంటికి కనిపిస్తున్నా... మార్కెట్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన సెక్యూరిటీ సిబ్బంది, క్లీనింగ్ సిబ్బంది ఏమి చేస్తున్నారో... ఎక్కడున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పాలక మండలి మేల్కొని ఏపీఎంసీ పరిసరాలు శుభ్రంగా ఉంచి... మార్కెట్‌కు వచ్చిన వ్యాపారులకు, రైతులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాంగ్రెస్ పార్టీలోకి వలసలు



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్

కంప్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలో రోజురోజుకి బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు ఎక్కువయ్యాయి. బుధవారం సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రాకతో కుడితిని పట్టణంలోని పలువురు బీజేపీ నుంచి వి రాజశేఖర్, వెంకటరమణబాబు, దొడ్డప్ప నేతృత్వంలో కాంగ్రెస్‌లోకి చేరారు. మాలింగ, చిదానంద, కుంబరు నాగప్ప, గాదెలింగప్ప, విరుపన్న, తిమ్మప్పలతో పాటు వంద మంది బళ్లారి సిటీ ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కుడితినిలో నారా భరత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందన్నారు. అందుకనే కుడితిని పట్టణంలో భారీగా బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరుతున్నారన్నారు. అలాగే వి రాజశేఖర్ అధ్యక్షులుగా ఉన్న సమయంలో కూడా కుడితిని పట్టణానికి కేఎంఎఫ్ నిధులు ఎన్నో ఇచ్చారన్నారు. అభివృద్ధి చూసే తమ పార్టీలోకి చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అన్నపూర్ణకు ప్రతి ఒక్కరు భారీ మెజార్టీ అందించి గెలిపించాలన్నారు.

కార్యాలయ భవనం ప్రారంభం



భవనాలను ప్రారంభించిన టీబీ బోర్డు చైర్మన్ పాండ్య

బళ్లారి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువ కాలువ(ఎల్లెల్సీ) ప్రధాన కార్యాలయంలో నూతనంగా నిర్మించిన ఈఈ ఆఫీస్, సిబ్బంది కార్యాలయాలను బుధవారం బోర్డు చైర్మన్ పాండ్య, ఎస్ఈ నీలకంఠారెడ్డి, సెక్రెటరీ ఓఆర్‌కే రెడ్డి, హెచ్చెల్సీ ఈఈ రవింద్ర ప్రారంభించారు. తుంగభద్ర బోర్డు నిధులతో ఈ పనులు పూర్తీ చేశారు. గతంలో ఇక్కడ ఈఈ కార్యాలయం లేక ఇబ్బందిగా ఉండేది. ఈఈ కార్యలయం నిర్మాణానికి ప్రతిపాదన చేసి పనులు పూర్తీ చేశారు. ఉదయం సంప్రదాయ దుస్తులతో అధికారులు పాల్గొని పూజలు చేసి కార్యాలయం ప్రారంభించారు. డీఈలు సందాని, అమర్‌నాథ్ రెడ్డి, గోపీ, కాంట్రాక్టర్ రాజేంద్ర బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్ఎస్ అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శనలో దళిత సంఘర్షణ సమితి నాయకులు

బళ్లారి సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ సంస్థలైన ఐడీ, ఐటీ, సీబీఐ లను రాజకీయ ఉద్దేశాలకు దుర్వినియోగం చేయరాదని దళిత సంఘర్షణ సమితి సంచాలకులు ఏ మానయ్య అన్నారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నిష్ఠాతులైన ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై లేనిపోని అభాండాలు వేసి సీబీఐ తనిఖీ నిర్వహించి సీఎంను అరెస్టు చేయాలని ధర్నాలు నిర్వహిస్తోందన్నారు. కర్ణాటక రాష్ట్ర దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్రపతికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో గంగప్ప, దేవదాసు, అంజనేయులు, పంపాపతి, ఎర్రిస్వామి, హులుగప్ప, రామయ్య, హనుమంతప్ప, ఎత్తినబూదిహాల్ శివు, రాజణ్ణ, మహేశ్, తిరుమల, విజయ్ ఆసుండి, మల్లి, సిద్దార్థ గంగాధర, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అసహజ మరణాలను నివారించండి



వినతి పత్రం సమర్పిస్తున్న ఏఐఎంఎస్ఎస్

బళ్లారి సిటీ,నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చిన్నారుల అసహజ మరణాలు పెరుగుతున్నాయని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని అఖిల భారత మహిళా సాంస్కృతిక సంస్థ(ఏఐఎంఎస్ఎస్) జిల్లా ఆధ్యక్షులు ఈశ్వరి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో చిన్నారుల మరణాలు, పత్రికల్లో వచ్చిన నివేదికల ప్రకారం కేవలం మూడేళ్లలో 5,880మంది అసహజంగా మరణించడం చాలా దిగ్భ్రాంతికరం, బాధాకరమన్నారు. సిలికాన్ సిటీగా పేరుగాంచిన బెంగళూరులో అత్యధిక కేసులు నమోదు కావడం విచారకరమన్నారు. బెళగావి జిల్లా ఆసుపత్రిలో గత ఆరు నెలల్లో 111 మంది నవజాత శిశువులు మరణించారన్నారు. నియోనాటల్ ఇంటెన్సీవ్‌కేర్ యూనిట్‌లో ఆక్సిజన్ సక్రమంగా అందక వందలాది మంది శిశువులు మృత్యువాత పడుతున్నారన్నారు. క్షీణిస్తున్న మన ఆరోగ్య వ్యవస్థకు ఇది అద్దపండుతోందన్నారు. నేటికీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరిపడా వైద్యులు, వైద్య సిబ్బంది, మౌలిక వసతులు లేవన్నారు. వైద్యం అందక నిను పేదలకు ప్రభుత్వ ఆసుపత్రులు మృత్యు కుహరాలుగా మారుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరాన్ని బట్టి వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎంఎస్ఎస్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, విద్య, సౌమ్య, గిరిజ, అభిలాష పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో యోగా సమ్మిట్



యోగాసనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తోరణగల్లు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా కురేకుప్ప పట్టణంలో 14,15 తేదీల్లో గ్లోబల్ యోగా సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్‌కే యోగా కేంద్రం బళ్లారి జిల్లా వైస్ ప్రెసిడెంట్ రమేష్ తెలిపారు. బుధవారం స్థానిక పంపాపతి దేవస్థానంలోని కళ్యాణమండపంలో బళ్లారి జిల్లా స్థాయి గ్లోబల్ యోగా సమ్మిట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి యోగా సాధకులు పాల్గొన్నారు. ఎస్ఆర్‌కే యోగా కేంద్రం బళ్లారి జిల్లా వైస్ ప్రెసిడెంట్ రమేష్, యోగా కేంద్రం కురేకుప్ప బళ్లారి జిల్లా జీఎఫ్ కోఆర్డినేటర్, కుడితిని ఆరోగ్య మందిరం హరిగిరి ధోని యోగ కేంద్రం రాఘవేంద్ర, సౌమ్య రాఘవేంద్ర, ఓంశాంతి బ్రహ్మకుమారి రాజేశ్వరి తదితరులు యోగాతో కలిగే లాభాలు వివరించారు. భారతదేశాన్ని విశ్వగురు చేయడానికి యోగా కార్యక్రమాలు 14, 15 తేదీల్లో జరుగుతాయన్నారు. ఇందులో 40 దేశాలకుపైగా యోగా సాధకులు వస్తారన్నారు. అలాగే సండూరు శంకర్ యాదవ్, కంప్లి శ్యామల, హొస్పేట పూజ తదితర గ్రూపుల నుంచి భరతనాట్యం ప్రదర్శిస్తారన్నారు. యోగా సాధకుల నుంచి యోగా డెమో క్లాసులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కురేకుప్ప పురసభ అధ్యక్షులు కల్గుడప్ప, ప్రముఖులు కుమారప్ప, దేవన్న, పంపాపతి, ప్రకాష్, అనసూయ, భగత్‌సింగ్, మరిస్వామి, బసవరాజు పాల్గొన్నారు.

హొసూరు జోన్

మాజీ సైనికులకు ప్రత్యేక శిబిరం

హొసూరు(కృష్ణగిరి), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్మీ, నావీ, ఎయిర్‌ఫోర్స్‌లకు చెందిన మాజీ సైనికులు, వారి కుటుంబాలకోసం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. స్పర్శ్ కార్యక్రమం కింద ట్రై-సర్వీస్ (ఆర్మీ, నావీ, ఎయిర్ ఫోర్స్)పెన్షనర్లకు వారి వార్షిక జీవిత రుజువును గుర్తించడానికి వారి వివిధ పెన్షన్ సంబంధిత ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రత్యేక శిబిరం నిర్వహించారు. దక్షిణ భారత్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌లోని డిఫెన్స్ అకౌంట్స్ ఆఫీసర్ కార్యాలయం సహకారంతో శిబిరం ఏర్పాటైంది. కృష్ణగిరి జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం కృష్ణగిరిలోని ఎస్.వి.వి.కళ్యాణ మంటపంలో శిబిరాన్ని నిర్వహించారు. కృష్ణగిరి జిల్లాలో 13 వేల మంది పింఛనుదారులు ఉన్నారు, 4 వేల మంది కుటుంబ పింఛను పొందుతున్నారు. వేలూరు జిల్లా తర్వాత కృష్ణగిరి జిల్లాలో అత్యధికంగా సైన్యంలో పనిచేస్తున్నారు. డిపార్ట్‌మెంట్ అధికారులు, కమిటీలు వారితో వ్యక్తిగతంగా సమావేశమై పింఛన్ లోటుపాట్లకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరిస్తున్నారు. జిల్లాకు చెందిన మాజీ సైనికులు, వారిపై ఆధారపడిన వారు తమ పెన్షన్ సంబంధిత ఫిర్యాదులను వాట్సాప్ నంబర్ 8807380165 కు తెలియజేస్తే, అధికారులు మీకు పరిష్కారాలను తెలియజేస్తారన్నారు, అలాగే, జిల్లా కలెక్టరేట్‌లో మాజీ సైనికులు, వారిపై ఆధారపడిన వారి కోసం స్పర్శ్ సేవా కేంద్రాన్ని ప్రారంభించేందుకు పరిపాలన తరఫున అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో చెన్నై జోన్ యొక్క భద్రతా ఖాతాల నియంత్రణ దర్శకుడు జయశీలన్, ఆర్మీ కోయంబత్తూరు జోన్ అడ్మినిస్ట్రేషన్ కల్నల్, మురళీధరన్, మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ వెటరన్స్ వెల్ఫేర్ కల్నల్ వేలు, మాజీ సైనికోద్యోగులు, శాఖాధికారులు హాజరైయ్యారు.



శిబిరంలో కలెక్టర్ సరయు తదితరులు

డీఎంకే నియోజకవర్గ సభ్యుల సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.ప్రకాశ్

హొసూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హొసూరు, తళి, వేపనపల్లి శాసనసభ నియోజకవర్గాల డీఎంకే సభ్యులు, నియోజకవర్గ పార్టీ ఎన్నికల అధికారులు వడివేల్, ధర్మశీలన్, మురుగానందంలు బుధవారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. హొసూరు మీరామహల్, డెంకణీకోట రోడ్డు కళ్యాణమంటపం, శూలగిరి ఎస్ఎఎస్ కళ్యాణమంటపంలో జరిగిన సభలకు డీఎంకే జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే వై ప్రకాశ్ అధ్యక్షత వహించారు. యూనియన్ జిల్లాల వారీగా పిఎల్ఏ2 సమీక్షా సమావేశాలు, ఈనెల 17, 18, 23, 24 తేదీలలో పంచాయతీ వార్డుల వారీగా సమావేశాలు నిర్వహించడం, ఓటరు జాబితాలో పేర్లను చేర్చడం, తొలగించడం, ధృవీకరించడం వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ఉపకార్యదర్శి మురుగన్, నగర కార్యదర్శి మేయర్ సత్య జిల్లా ఉపకార్యదర్శి చిన్నస్వామి, కోశాధికారి సుకుమారన్, ముఖ్య కార్యవర్గ సభ్యులు వీరారెడ్డి, ఎల్లోరమణి, క్రిష్, జనరల్ కమిటీ సభ్యులు దనలక్ష్మి జయరామన్, మునిరాజ్, రాష్ట్ర యువజన సంఘం ఉప కార్యదర్శి శ్రీనివాసులు, యూనియన్ కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, దివాకర్, నాగేశ్, గజేంద్ర మూర్తి, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

గణిత సూత్రాల పఠనంలో రికార్డు



ప్రతిభ కనబరిచిన శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు

హొసూరు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హొసూరు నగరంలోని శ్రీ చైతన్య స్కూల్, యూకే వరల్డ్ రికార్డ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా ప్రపంచ రికార్డు సృష్టించారు. బుధవారం గణిత సూత్రాల పఠనతో మరో రికార్డు సృష్టించారు. 20 రాష్ట్రాల్లో 120 శ్రీచైతన్య స్కూల్ క్యాంపస్‌లలో 3 - 10 సంవత్సరాల వయస్సు గల 10వేల మంది విద్యార్థులు 1000 వీడియోల ద్వారా ఏకకాలంలో గణిత సూత్రాలను పఠించారు. వరల్డ్ బుక్ ఆర్గనైజేషన్ అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. వారు ఏకకాలంలో మానిటర్, రికార్డు ప్రదర్శన లను విశ్లేషించారు. ఇలా పాల్గొన్నవారిలో హొసూరు నగరంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు కూడా ఉన్నారు. ప్రపంచ రికార్డుకు తక్షణ గుర్తింపును అందించారు. ఈ ఘనతల్లో పాల్గొన్న పదివేల మంది విద్యార్థులను పాఠశాల యాజమాన్యం తరఫున అభినందించారు. ఇప్పటికే శ్రీచైతన్య విద్యాసంస్థ మూడు ప్రపంచ రికార్డులు సాధించిన విషయం విదితమే.

బ్రిడ్జి నిర్మించాలని వినతి

హొసూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పలు గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం కలుగుతున్నవాటిల్లో తట్టనపల్లి ఒకటి. హొసూరు సమీపంలోని కెలవరపల్లి డ్యాంకు పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ఇన్‌ఫ్లో పెరిగినప్పుడల్లా దక్షిణాపినాకిని నదికి వరద పోటెత్తుతోంది. దీంతో కెలవరపల్లి ఆనకట్ట సమీపంలో హొసూరు-నందిమంగలం రహదారిపై ఉన్న తట్టనపల్లి కాలిబాట వంతెన ముంపునకు గురై సుమారు 10 గ్రామాలవారు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం చిత్తన్నపల్లి గ్రామస్తులు హొసూరులోని జలవనరుల శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు



సమస్యను వివరిస్తున్న తట్టనపల్లి గ్రామస్థులు